
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
****



నల్లగొండ

5 గురువారం 17 ఏప్రిల్ 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 , కనిష్ఠం 23.0

గ్రూప్-1కు 'ఆంధ్రజ్యోతి' ఉపయోగపడింది



- డీటీసీ శ్రీవాణి
- దినపత్రికల పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది : డీటీవో లావణ్య
- 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల ప్రదానం

• 7లో..

'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ ప్రథమ బహుమతి విజేత వెలుగూరి కార్తీక్‌కు చెక్ అందజేస్తున్న డీటీసీ శ్రీవాణి, చిత్రంలో డీటీవో లావణ్య, 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్‌రావు

మే 15 వరకు సెమిస్టర్ పరీక్షలు వాయిదా



హైదరాబాద్‌లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధులు

- అయోమయంలో డిగ్రీ విద్యార్థులు
- మెట్టుదిగని ప్రభుత్వం
- పట్టువీడని యాజమాన్యాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- పరీక్షలపై బహిష్కరణ అస్త్రం
- విద్యార్థులకు నష్టమే

• 7లో..

రవాణాశాఖ లక్ష్యానికి
తగ్గిన ఆదాయం



- లక్ష్యం రూ.323కోట్లకు రూ.272కోట్ల రాబడి
- 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 4శాతం అధికం

కోదాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధానంగా రవాణాశాఖ పన్నులు, మద్యం, రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా ఆదాయం వస్తుంది. రియల్టీ రెండేళ్లుగా తగ్గినా, ఎల్‌ఆర్‌ఎస్ చార్జీల పెంపుతో రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా నిలకడగా ప్రభుత్వానికి ఆదాయం లభించింది. మద్యం ధరల పెంపుతో గత ఏడాదితో పోల్చితే ప్రభుత్వ ఆదాయం తగ్గింది. బీర్ల ధరల పెరుగుదలతో ఎక్సైజ్‌శాఖ వచ్చే రాబడి సుమారు 5శాతం మేర తగ్గింది. రవాణాశాఖ సైతం లక్ష్యం మేర ఆదాయం సాధించలేకపోయింది. అయితే

మిగతా 7వ పేజీలో...

జిల్లాల వారీగా రవాణాశాఖకు వచ్చిన రాబడి ఇలా..

పన్నులు	నల్లగొండ		సూర్యాపేట		యాదాద్రి		మొత్తం (రూ.కోట్లలో)	
	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు
క్వార్టర్లీ ట్యాక్స్	51.64	40.53	39.76	32.76	33.28	25.07	124.68	98.36
లైఫ్ ట్యాక్స్	10.76	9.06	66.72	55.45	56.88	47.63	134.36	112.10
సర్వీస్ ట్యాక్స్	6.00	5.30	3.96	3.3	3.00	2.45	12.96	11.06
గ్రీన్ ట్యాక్స్	12.24	10.57	12.00	9.5	12.00	9.6	14.64	12.48
డిటెక్షన్ ట్యాక్స్	28.20	30.10	5.64	5.30	2.88	3.04	36.72	38.44

పరిహారం మింగేశారు

- ఫోర్జరీ సంతకాలతో నిధులు స్వాహా
- సుంకిశాల ప్రాజెక్టు పైపులైన్ నిర్వాసితులకు దక్కని పరిహారం



పర్వేదుల గ్రామ సర్వే నెం.93 వరకు వచ్చి నిలిచిన పైపులైన్ పనులు

జంట నగరాలకు తాగునీరందించే లక్ష్యంతో సుమారు రూ.5వేల కోట్ల అంచనాతో 1998లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ నిర్మాణ పనులకు 47.16ఎకరాల భూసేకరణ చేశారు. కాగా, నిర్వాసితులకు అందాల్సిన పరిహారాన్ని కొందరు అవినీతి అధికారులు మింగేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాసిత రైతుల పేరు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ కావాల్సిన నగదును సంతకాల ఫోర్జరీలతో నేరుగా డ్రాచేసి లక్షల రూపాయలు కాజేసినట్లు సమాచారం. దీంట్లో పెద్దవూర మండలం పర్వేదులకు చెందిన ఓ గ్రామస్థాయి అధికారి కుమారుడు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నాటి ఆర్డీవో కార్యాలయ కేంద్రంగా అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, అధికారులు మౌనంగా ఉన్నారు. సుమారు 64 మంది లబ్ధిదారులకు అందాల్సిన పరిహారాన్ని 40మంది రైతులకే అందజేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు మారడంతో మధ్యలో నిలిచిన పైపులైన్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ ప్రారంభించడంతో నిర్వాసితుల పరిహారాన్ని కాజేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ

పుట్టంగండి నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని తరలిస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 510 అడుగుల నీరు ఉంటనే పుట్టంగండి నుంచి నీటిని అక్కంపల్లి రిజర్వాయర్‌కు తరలించే అవకాశం ఉంది. 510 అడుగులకంటే తక్కువ నీటి లభ్యత ఉన్న సందర్భాల్లో జంటనగరాలకు నీటి ఎద్దడికి అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగర్ ప్రాజెక్టులో 480 నుంచి 490 అడుగుల వద్ద నీరు ఉన్నా కృష్ణాజలాలను తరలించేందుకు నదీ తీరంలోని సుంకిశాల నుంచి పర్వేదుల, సంగారం, పోతునూరు, కోదండాపూర్ వరకు పైపులైన్ నిర్మించి అక్కడ నీటిని ఫిల్టర్ చేసి హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో భాగంగా 1998లో భూసేకరణకు నాటి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

నష్టపరిహారం ఎకరాకు రూ.50వేలు

సుంకిశాల వద్ద కౌంపౌండ్ వాల్ నిర్మించి పైపులైన్ కోసం సేకరించే భూమికి తరి ఎకరాకు రూ.50వేలు, మెట్టకు రూ.30వేలు పరిహారం నిర్ధారించి 1999లో భూసేకరణ చేశారు. పర్వేదుల రెవెన్యూ పరిధిలో 64 మంది రైతులకు చెందిన 47.16 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు గుర్తించారు. అందులో కొందరు రైతులు భూమి ఇచ్చేందుకు నిరాకరించారు. పర్వేదులతో పాటు సంగారం, పోతునూరుకు చెందిన నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించేందుకు 2000, ఆగస్టులో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు నిధులు మంజూరు చేసింది. రూ.25,86,000 (చెక్ నెం.771594), రూ.12,00,000 (చెక్ నెం.732244) చెక్‌లను మిర్యాలగూడ డివిజన్ కార్యాలయానికి పంపింది.

నిలిచిన పైపులైన్ ప్రాజెక్టు పనులు

ప్రభుత్వం 2005లో రూ.2,813కోట్లతో ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరందించడమే గాక, హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాలకు తాగునీరందించే లక్ష్యంతో 2007లో ఎస్ఎల్‌బీసీ నిర్మాణ పనులు ప్రారంభించి 44కి.మీ సొరంగ మార్గానికి ఇరువైపులా ఇన్‌లెట్, అవుట్‌లెట్ వైపు నుంచి పనులు ప్రారంభించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా హైదరాబాద్‌కు తాగునీరు అందుతుందని, పైపులైన్ నిర్మాణం అవసరం లేదంటూ సుంకిశాల-కోదండాపూర్ పనులను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో తీవ్ర జాప్యం జరిగి నేటికీ పనులు పూర్తికాలేదు.

పనులు నిలిచిపోవడంతో అక్రమాలు

ప్రభుత్వం 2004లో సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ పనులు నిలిపివేయడంతో అప్పటికే హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి నిర్వాసితులకు పరిహారం కింద మంజూరైన నిధులు కాజేసే కుట్రకు

మిగతా 8వ పేజీలో...

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

- ప్రజలు ఇదే కోరుకుంటున్నారు
- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

దేవరకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చాలని కేసీఆర్‌ను ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతోందన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్కడి సీఎం చంద్రబాబు 72శాతం వినియోగించగా, మన రాష్ట్ర ప్రభుత్వం 28శాతం వినియోగించుకుందని, దీనిపై మాట్లాడే దమ్ము మంత్రులకు లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబును చూస్తేనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా హామీలు ఇచ్చి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ మోసగాళ్ల పార్టీ అని, కమీషన్లు వచ్చే పనులే చేస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు నిలదీస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే పరిస్థితిలేదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వమని, ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేసి పొరపాటు చేశామని ప్రజలు చర్చించికుంటున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ నియోజకవర్గానికి రూ.600కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి 5వేల మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, కేతావత్ బీల్యానాయక్, గాజుల ఆంజనేయులు, కంకణాల వెంకటరెడ్డి, లోక్యానాయక్, సుభాష్‌గౌడ్, చింతపల్లి పుల్లయ్య, దస్రునాయక్, రాఘవచారి, నారాయణరెడ్డితోపాటు నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ ఇలాత్రిపాఠి

మర్రిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలాత్రిపాఠి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. సెలవులు పెట్టకుండా, విధులకు హాజరు కాకుండా ఉన్న వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, రోగులకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని సూచించారు. సిబ్బంది విధులకు రాకపోవడంతో డీఎంహెచ్‌తో ఫోన్ మాట్లాడి సెలవులు పెట్టకుండా విధులకు హాజరు కాని



మర్రిగూడలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ తనిఖీ చేసి రోగులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి హామీ పనులు భేష్

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నందుకు మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్యను కలెక్టర్ అభినందించారు. ఎంపీడీవో కార్యాలయానికి ఆమె వెళ్లి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో పాల్గొన్నారు.

స్థలాలు సేకరించాలి

చండూరు: శివన్నగూడెం రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల స్థానంలో ఏర్పాటు చేయనున్న పునరావాస కేంద్రాలకు రెండు రోజుల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చండూరు ఆర్డీవో కార్యాలయంలో చండూరు, దేవరకొండ ఆర్డీవోలు శ్రీదేవి, రమనారెడ్డి ఇతర శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు.

బతికుండగానే చంపేశారు సార్

- ఏఎస్పీ, తహసీల్దార్‌కు బాధితురాలి ఫిర్యాదు
- 3ఎకరాల భూమి కోసం మాజీ సర్పంచ్, ఆమె భర్త దారుణం
- రెవెన్యూ అధికారుల విచారణతో వెలుగులోకి

దేవరకొండ, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ పేరిట ఉన్న మూడు ఎకరాల భూమిని కాజేసేందుకు అప్పటి అధికార పార్టీ సర్పంచ్(బీఆర్ఎస్), ఆమె భర్త పన్నాగం వెలుగుచూసింది. సదరు మహిళ బతికి ఉండగానే మరణించినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. 2022-23 సంవత్సరంలో ఈ సంఘటన జరగ్గా, బాధితుల ఫిర్యాదుతో సంఘటన తెలిసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దేవరకొండ మండలం కాచారం గ్రామానికి చెందిన అబ్బనబోయిన పెద్దమ్మ పేరిట అదే గ్రామంలోని సర్వేనంబర్ 13/12/1లో మూడు ఎకరాల భూమి ఉంది. పెద్దమ్మ గ్రామంలో కూలి పనులకు వెళ్తుండగా, భర్త దివ్యాంగుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. కుమారులు, కుమార్తె వివాహం కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దమ్మ తన మూడు ఎకరాలు అప్పుడప్పుడు సాగు చేస్తుండగా, కొన్నాళ్లు పడావుగా ఉంటుంది. ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో నమోదుకాగా, డిజిటల్ సంతకం పెండింగ్‌లో ఉన్నందున పట్టా పాస్ పుస్తకం జారీ కాలేదు. రైతు బంధు కూడా రావడం లేదు. ఆ మూడు ఎకరాలు గ్రామ శివారులో ఉండడం, పడావుగా ఉండడం, ఎకరా రూ.30-40లక్షల వరకు పలుకుతుండడంతో అప్పటి గ్రామ సర్పంచ్ నోముల లక్ష్మి(బీఆర్ఎస్), ఆమె భర్త యాదయ్యకు కన్నుపడింది. భూమిని కాజేయాలనే దురుద్దేశంతో 2020లో పెద్దమ్మ చనిపోయినట్లుగా గ్రామ పంచాయతీలో మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించాడు. అనంతరం డెత్ సర్టిఫికెట్ ద్వారా పెద్దమ్మ వారసులుగా పేర్కొంటూ నోముల లక్ష్మి, యాదయ్యలు పౌతీ కోసం మీసేవ ద్వారా తహసీల్దార్, జాయింట్ సెక్రటరీకి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటినుంచి పౌతీ దరఖాస్తు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ సర్పంచ్ పౌతీ చేయాలని ఒత్తిడి చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో దేవరకొండ ఆర్ఐ గోపిరాజు, రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టగా అబ్బనబోయిన పెద్దమ్మ బతికే ఉన్నట్లు



బాధితురాలు పెద్దమ్మ, ఆమె భర్త అచ్చయ్య

తేలింది. దీంతోపాటు పెద్దమ్మకు, మాజీ సర్పంచ్‌కు ఎలాంటి బంధుత్వం, రక్త సంబంధం లేదని విచారణలో వెల్లడైంది. పెద్దమ్మకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని గ్రామస్థులు ఆర్ఐకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్ఐ పౌతీ దరఖాస్తును తిరస్కరించారు. ఆర్ఐ విచారణతో విషయం వెలుగులోకి రావడంతో మాజీ సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త యాదయ్యపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాధితురాలు పెద్దమ్మ బుధవారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక, తహసీల్దార్ సంతోష్‌కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. తన మూడు ఎకరాల భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని అధికారులను కోరారు. సంబంధిత ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం మాజీ సర్పంచ్, ఆమె భర్త కాంగ్రెస్‌లో చేరారు.

ప్రయాణికుల దాహం తీర్చరూ

ఆర్టీసీ బస్టాండ్లలో ఇక్కట్లు • 6లో..

అప్రమత్తంగా ఉందాం

● సెలవు రోజుల్లో ప్రాజెక్టులు, నదులు, చెరువుల వద్దకు పర్యాటకులు ● కనిపించని హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు • 7లో..

మల్లీశ్వరి ఆత్మహత్యకు కారకులను
కఠినంగా శిక్షించాలి

బొక్కమంతలపహడ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బొక్కమంతులపహడ్ గ్రామస్థులు

నిడమనూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామానికి చెందిన దర్శారపు మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బుధవారం రాత్రి ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. నిందితుడు జాన్‌రెడ్డితో పాటు అయన కుటుంబ సభ్యులపై హత్యా కేసు నమోదు చేసి శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటమ్మ, వెంకటయ్య, వంగాల నాగార్జున, మాతంగి శాంతికుమార్, కురుపాటి కోటేశ్వర్, రేగూరి భరత్‌కుమార్, దర్శారపు శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్వీట్: ప్రియుడి చేతిలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న దళిత యువతి మల్లీశ్వరి కుటుంబానికి మద్దతుగా సంఘీభావం తెలుపుతూ బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తదితరులు ట్వీట్లు చేశారు. కుల వివక్షకు మరో ప్రాణం బలైందని, ఈ మారణహోమం ఆగేదెన్నడో అంటూ ట్వీట్ చేశారు. మృతురాలి ఆత్మహత్యకు కారణమైన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మల్లీశ్వరి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కుల వివక్ష అంతం కావాలని ట్వీట్ చేశారు.

ప్రయాణికుల దాహం తీర్చరూ

తీరని దాహార్తి



నార్కట్‌పల్లి బస్టాండ్‌లో పనిచేయని వాటర్‌ఫిల్టర్

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)
నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు దప్పిక తీరే దారి లేదు. దివీస్ సంస్థ ఏర్పాటుచేసిన తాగునీటి యంత్రం పనిచేయడంలేదు. ఆర్టీసీ పరంగా కుళాయిలు లేక ప్రయాణికులు నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. డిపోపై సంస్థ పూర్తిగా నిరాదరణ చూపుతుండటంతో బస్టాండ్‌లో వసతులు కరవవుతున్నాయి. గతంలో క్యాంటిన్ నిర్వహించే సమయంలో ప్రయాణికులు అక్కడే నీటిని తాగి దప్పిక తీర్చుకునేవారు. కొన్నేళ్లుగా బస్టాండ్‌కు వచ్చే బస్సుల సంఖ్య తగ్గడంతో గిరాకీ లేక క్యాంటిన్ మూతబడింది. టెండర్ పిలిచినా ఎవరూ ముందుకురాలేదు. ప్రస్తుతం కుళాయిల ద్వారా బస్టాండ్‌లో తాగునీటి వసతి కల్పించినా సరైన సేవలందటం లేదు.



నల్లగొండలో వ్యర్థపదార్థాలతో మంచినీటి కుళాయి

ఆర్టీసీ బస్టాండ్లలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వేసవి కాలం కావడంతో ఎండ తీవ్రతకు దాహం వేస్తే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి కుళాయిలు ఉన్నా పరిశుభ్రత లేక కొన్నిచోట్ల, రద్దీకి తగ్గట్లుగా నీరందక పలుచోట్ల బస్టాండ్లలోని దుకాణాల్లో మంచినీటి బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. మంచినీటి బాటిల్‌పై రూ.5 నుంచి రూ.10 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

● నల్లగొండ బస్టాండ్‌లో తాగునీటికి తిప్పలు

(ఆంధ్రజ్యోతి-నల్లగొండ)
జిల్లా కేంద్రమైన నల్లగొండ బస్టాండ్‌లో ఉదయం నాలుగు గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రయాణికుల రద్దీ రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంటోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బస్సు సర్వీసులు కూడా హైదరాబాద్‌కు ఈ బస్టాండ్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీససౌకర్యాలు కరువయ్యాయి. వేసవి తీవ్రతతో ప్రయాణికులు దాహంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మంచినీటి నల్లాలు ఉండగా ఒకటి పూర్తిగా బంద్ కాగా మరొకటి చాలీచాలని నీటిని అందిస్తోంది. ఆ నల్లా నుంచి వచ్చే నీరు పరిశుభ్రంగా లేకపోవడంతో తాగేందుకు ప్రయాణికులు ఇష్టపడం లేదు. దీంతో దుకాణాల వద్ద రూ.10ల వరకు ఎక్కువ ధరకు మంచినీటి బాటిళ్లను కొనుగోలు చేసి దాహార్తి తీర్చుకుంటున్నారు. అయితే బస్టాండ్ బయట చలివేంద్రం ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అక్కడే మంచినీరు తాగుతూ కాస్త ఉపశమనం పొందుతున్నారు. తాగునీటి ఏర్పాట్లు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.



తాగునీటి సౌకర్యం కల్పించాలి

నల్లగొండ బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం కల్పించాలి. నల్లాల నుంచి వేడినీరు వస్తోంది. తాగేందుకు ఇబ్బందిగా ఉంది. ప్రయాణికులు మంచినీళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటర్ బాటిళ్లను అధిక ధరకు విక్రయిస్తున్నారు.

రమావత్ కవిత, హాలియా

● సూర్యాపేటలో సరిపడా అందని నీరు

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేటఅర్బన్)
సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీటి కటకటతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కొత్తబస్టాండ్‌లో ఒక్కటే వాటర్ ఫ్రిజ్ ఉంది. ప్రతి రోజూ 90 నుంచి 110 లీటర్ల మంచినీరు అవసరం కాగా 70 లీటర్ల వరకు అందిస్తున్నారు. అదేవిధంగా హైటెక్ బస్టాండ్‌లో ఫ్రిజ్ ఉండగా ప్రతి రోజూ 90 లీటర్ల మంచినీరు అవసరం కాగా 50 లీటర్ల నీరు మాత్రమే అందిస్తోంది. దీంతో మంచినీటి కోసం ప్రయాణికులు తప్పనిసరిగా అక్కడి దుకాణాల్లో మంచినీటి బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు.



ఫ్రిజ్ నీరు తాగుతున్న ప్రయాణికుడు



మిర్యాలగూడలో కొన్నేళ్లుగా సత్యసాయి సేవా సంస్థ నిర్వహిస్తున్న చలివేంద్రం

మిర్యాలగూడలో నీటిసౌకర్యం

(ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)
ప్రయాణికుల తాగునీటి ఇబ్బందులు తీర్చడంలో మిర్యాలగూడ ఆర్టీసీ అధికారులు ముందంజలో ఉన్నారు. వాటర్‌కూలర్ ఏర్పాటుచేసి దాహార్తి తీరుస్తున్నారు. అదేవిధంగా సత్యసాయి సేవా సంస్థ దశాబ్దకాలంగా బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటుచేస్తోంది. అదేవిధంగా వాసవీ, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో అడపాదడపా చల్లటి నీరు, పెరుగన్నం అందిస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ సుమారుగా 45వేల మంది ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకుంటుంటారు. మూత్రశాలలు, హ్యాండ్‌వాష్ ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్

దేవరకొండలో అరకొరగా

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)
నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ, వాసవీ క్లబ్ చలివేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ నీరు సరిపోకపోవడంతో ప్రయాణికులు దుకాణాల్లో తాగునీటిని కొనుగోలు చేస్తున్నారు. డిపో పరిధిలో 103 బస్సు సర్వీసులుండగా వీటిని మహబూబ్‌నగర్, మిర్యాలగూడ, భద్రాచలం, శ్రీశైలం, హైదరాబాద్, అచ్చంపేట, మాచర్లతో పాటు నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు నడిపిస్తుంటారు. నల్లగొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లా సరిహద్దు కావడంతో దేవరకొండ డిపో నుంచి రోజుకు 30 నుంచి 40వేల వరకు ప్రయాణికులను బస్టాండ్‌కు వచ్చిపోతుంటారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు రెండు ఫ్రిజ్‌లు ఏర్పాటు చేసినా సరిపోవడంలేదు. వాసవీక్లబ్ నిర్వాహకులు చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజూ బస్టాండ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని దుకాణాలలో రూ.20 వేల నుంచి రూ.30వేల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం.





మంచినీటి బాటిల్ కొనుగోలు చేశా

మా ఊరికి పోయేందుకు దేవరకొండ బస్టాండ్‌కు వచ్చా. దాహమేసింది. నీరు ఎక్కడ ఉందో తెలియక దుకాణంలో లీటర్ బాటిల్ కొనుగోలు చేశా. ఆర్టీసీ అధికారులు సరిపడా నీటిని ప్రయాణికులకు సరఫరా చేయాలి. బోర్డులు ఏర్పాటుచేయాలి.

రాములు, ప్రయాణికుడు గన్నేర్లపల్లి, చందంపేట మండలం

సమన్వయ లోపం.. ప్రయాణికులకు శాపం

(ఆంధ్రజ్యోతి-కోదాడ రూరల్)
సూర్యాపేట జిల్లా కోదాడ బస్టాండ్‌లో ప్రయాణికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో హైదరాబాద్-విజయవాడ రహదారిపై రోజుకు 500 పైగా బస్సు సర్వీసులు ఈ బస్టాండ్‌కు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో నిత్యం ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంతో రద్దీ మరింత పెరిగింది. అందుకు అనుగుణంగా బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. కనీసం మూత్రశాలలు లేక ప్రయాణికులు ఆవరణను వినియోగిస్తున్నారు. సుమారు రూ.5లక్షలతో బస్టాండ్‌లో కోదాడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణలో మునిసిపల్ అధికారులు, ఆర్టీసీ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ప్రారంభించలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్లు డీఎం కార్యాలయం పక్కన ఉండడంతో తప్పని పరిస్థితిలో మహిళలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఫ్రిజ్‌ను ఏర్పాటుచేశారు. దీంతో ప్రయాణికులకు తాగునీటి సమస్య లేకుండాపోయింది.



వేర్వేరుచోట్ల ముగ్గురి బలవన్మరణం



చలపతిరావు(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా గన్నవరం మండలం బుడ్డవరం గ్రామానికి చెందిన పందేటి చలపతిరావు(38) 20 ఏళ్లుగా స్థానిక దివీస్ పరిశ్రమలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి గణేశ్‌నగర్‌లో నివాసముంటున్నాడు. చలపతిరావుకు ఇటీవల ఆర్థికఇబ్బందులు ఎక్కువ కావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన చలపతిరావు మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. అనంతరం కుటుంబ సభ్యులు గమనించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి వీరరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చలపతిరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నల్లగొండలో యువతి...



కత్తుల మాధురి(ఫైల్)

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాన్యంచెల్కకు చెందిన కత్తుల మాధురి(26) బీటెక్ పూర్తి చేసి ఓ ప్రైవేట్ జాబ్ చేసి ఇటీవల మానేసింది. ఈ మధ్య తల్లిదండ్రులు ఆమెకు ఓ యువకుడితో వివాహన్ని నిర్ణయించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మాధురి తల్లి కత్తుల రూప ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని తల్లి ఫిర్యాదులో పేర్కొంది.

తిప్పర్తిలో వివాహిత...

తిప్పర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం యర్రగంట్లగూడెంలో వివాహిత బలవన్మరణం చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజుపేట గ్రామపంచాయతీ పరిధి యర్రగంట్లగూడెం గ్రామానికి చెందిన నక్క రమణ(32) భర్త వెంకన్నలు వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. కాగా బుధవారం ఉదయం భార్యాభర్తలు వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. 11 గంటలకు భర్త పొలం దగ్గరే ఉండగా కుమారులు పాఠశాల నుంచి వచ్చే సమయం కావడంతో రమణ ఇంటికివెళ్లింది. కొద్దిసేపటికి ఇద్దరు కుమారులు ఇంటికి వచ్చి కిటికీ నుంచి చూడగా ఇంట్లో తల్లి ఉరివేసుకొని కనిపించింది. చుట్టుపక్కల ఇంట్లోకి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. రమణ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒడిశా రాష్ట్ర కార్మికురాలి మృతి

బొమ్మలరామారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో విద్యుదాఘాతంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికురాలు మృతి బుధవారం చెందింది. ఎస్‌ఐ బుగ్గ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామ శివారులోని ధీరావత్ రవికి చెందిన ఇటుకబట్టీలో ఒడిశా రాష్ట్రం మరిబాహల్ గ్రామానికి చెందిన భానుమతి మాజీ(26) కొంతకాలంగా భర్త శోభన్ మాజీతో కలిసి ఇటుకబట్టీ వద్ద పనిచేస్తోంది. మంగళవారం రాత్రి తాను నివాసముంటున్న రేకుల గదికి విద్యుత్ సరఫరా చేసే వైర్ తెగి రేకుల మీద పడింది. విద్యుత్ సరఫరా అవుతున్న విషయం గమనించక ప్రమాదవశాత్తు తలకు తగలడంతో భానుమతి విద్యుదాఘతానికి గురైంది. గమనించిన తోటి కార్మికులు ఆమెను భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే సరికి చనిపోయింది. భర్త శోభన్ మాజీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

51 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ చింతూరు నుంచి రాష్ట్రంలోని సంగారెడ్డి పటాన్‌చెరువుకు తరలిస్తున్న రూ.14.50 లక్షల విలువైన 51.13 కిలోల గంజాయిని బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలో పట్టుకున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌ఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పట్టణ శివారులోని జగదేవ్‌పూర్ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని తరలిస్తున్న సంగారెడ్డి జిల్లా ఈషన్నపురం గ్రామానికి చెందిన మహ్మద్ అమీర్, సికింద్రాబాద్ ముషీరాబాద్‌కు చెందిన డ్రైవర్ మహ్మద్ ఇస్మాయిల్, అదే ప్రాంతానికి చెందిన సెంట్రింగ్ కార్మికులు మహ్మద్ ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఏపీ నుంచి తీసుకువస్తున్నట్లు ఒప్పుకున్నారు. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. మరో నిందితుడు హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన బాషా పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మాచారంలోని రామాలయంలో చోరీ

పెన్‌పహాడ్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామంలోని శ్రీరామాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ గోపీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి శ్రీరామాంజనేయస్వామి ఆలయ సిబ్బంది అక్కనపల్లి వెంకన్న 7:30 గంటలకు ప్రతిరోజూ మాదిరిగానే తలుపులు వేసి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఉదయం ఆరు గంటలకు గుడికి వెళ్లి చూడగా తాళం విరగ్గొట్టి కనిపించాయి. అమ్మవారి మెడలోని ఎనిమిది గ్రాముల బంగారం పుస్తె, 35 గ్రాముల సిల్వర్ శఠగోపురం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై దేవాలయ ట్రస్ట్ చైర్మన్ బొల్లక రామచంద్రయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు.

యక్షగాన కళాకారులకు నిలయం

● చౌటుప్పల్‌లో 30 మందికి పైగా కళాకారులు

యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణం యక్షగాన కళాకారులకు నిలయంగా అలరారుతోంది. ఆరు దశాబ్దాలుగా చౌటుప్పల్‌తో పాటు చుట్టపక్కల గ్రామాల్లో కళాకారులు యక్షగానాలను ప్రదర్శిస్తూ అందరినీ రంజింపజేస్తున్నారు. గంటల తరబడి కొనసాగే యక్షగానాలను ప్రజలు ఇప్పటికీ ఆదరిస్తున్నారు. సుమారు 30 మంది కళాకారులు ఈ ప్రాంతంలో ఆ కళను కొనసాగిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-చౌటుప్పల్ టౌన్)
చౌటుప్పల్‌లో కొన్నేళ్లుగా యక్షగాన కళాకారులు ప్రదర్శనలిస్తున్నారు. ప్రధానంగా లవకుశ, శ్రీభక్తమార్కండేయ చరిత్ర, మాయ సుభద్ర, కర్ణ దుశ్శాసన వధ, కిరాతార్జున యుద్ధం తదితర యక్షగానాలను సంవత్సరానికి పలుమార్లు ప్రదర్శిస్తున్నారు. శ్రీభద్రావతి- భావనారుషి కల్యాణం, శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాలతో పాటు ఇతర ముఖ్యమైన సందర్భాల్లో యక్షగానాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకుల ఆదరాభిమానాలను చూరగొంటున్నారు. ప్రస్తుతం పట్టణానికి చెందిన కళాకారులు గోశిక బిక్షపతి, బడుగు శ్రీరాములు, పోలోజు రాజుచారి, గ్యార కిష్టయ్య, యాట వెంకటేశం, యాట ముత్యాలు, బడుగు బాలరాజ్, బడుగు శ్రీను, గోశిక పురుషోత్తం, చిట్టిపోలు వెంకటేశం, బడుగు బిక్షపతి , గోశిక సత్యనారాయణ, పోలోజు వెంకటాచారి, కర్నాటి శ్రీశైలం ప్రస్తుతం ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. ఈ బృందానికంటే ముందు 25 నుంచి 30 మంది యక్షగాన కళాకారులు ఉండేవారు. కాగా ఆ బృందంలోని కొంతమంది కళాకారులు కాలం చేశారు.



లవకుశ నాటకంలోని శ్రీరామ పట్టాభిషేక ఘట్టం

గ్రామీణ కళల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో..

చౌటుప్పల్ పట్టణంలో పదేళ్ల క్రితం స్థాపించిన గ్రామీణ కళల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కళలు, కళాకారులను ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ ఏడాది ఉగాది పండుగ సందర్భంగా యక్షగాణాలను ప్రదర్శిస్తున్నారు. సమితి ఆధ్వర్యంలో అంబక సుర వధ, శశిరేఖా పరిణయం, అపురూపవతి, శివలీలలు, విధి మహేందాత చరిత్ర, బాలనాగమ్మ చరిత్ర, రేణుకా ఎల్లమ్మ చరిత్రలను యక్షగానాల ద్వారా ప్రేక్షకులకు పురాణాలను పరిచయం చేశారు. ప్రస్తుతం సమితికి ప్రముఖ యక్షగాన కళాకారుడు గ్యార కిష్టయ్య అధ్యక్షుడిగా బాధ్యతలను నిర్వ హిస్తున్నారు. కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి



చౌటుప్పల్‌లో ప్రత్యేక శిక్షణాకేంద్రాన్ని ఏర్పాటు చేసి కళలు, కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులను జారీ చేసి, 50 ఏళ్ల దాటిన వారికి నెలకు రూ.10 వేల పింఛన్ అందించాలి. అర్హత కలిగిన కళాకారులకు సాంస్కృతిక శాఖలో ఉద్యోగాలు కల్పించాలి. మరుగున పడుతున్న కళలకు జీవం పోయడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు మా సంస్థను స్థాపించాం. పదేళ్లగా ప్రదర్శిస్తున్న యక్షగానాలను ఈప్రాంత ప్రజలు ఆదరిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.

గ్యార కిష్టయ్య, అధ్యక్షుడు, గ్రామీణ కళాకారుల పరిరక్షణ సమితి, చౌటుప్పల్

ఎన్టీఆర్ లవకుశ గుర్తుకు వచ్చేలా

శ్రీరాముడిగా గోశిక బిక్షపతి, సీతమ్మగా పోలోజు రాజుచారి అద్భుతంగా అభినయించి ఎన్టీఆర్ లవకుశ సినిమాలో శ్రీరాముడు, సీత పాత్రలను ప్రేక్షకులు గుర్తు కు వచ్చేలా రక్తికట్టిస్తుంటారు. 2022లో శ్రీరామనవమి సందర్భంగా ప్రదర్శించిన లవకుశ యక్షగానం ఎంతో గుర్తింపు పొందింది.

రంగస్థలకళాకారులకు ఆదరణ కరువు

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)
తమ కళల ద్వారా వినోదం, ఆనందం పంచుతున్న రంగస్థల కళాకారులకు ఆదరణ కరువైంది. ఇతిహాస, పురాణాలే కాకుండా సమాజంలోని రుగ్మతలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు కళాప్రదర్శనలు ఇస్తున్నా వారి కుటుంబాలు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయి. సూర్యాపేట జిల్లాలో 2000 మందికి పైగా కళాకారులు 120 నాటక సమాజాలను రిజిస్టర్ చేయించుకొని ప్రస్తుతం సొంత ఖర్చులు, దాతల సహకారంతో నాటకాలు ప్రదర్శిస్తున్నారు. గ్రామీణప్రాంతాల్లో సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ, చింతామణి, శ్రీకృష్ణరాయభారం, రామాంజనేయ యుద్ధం, పల్నాటి యుద్ధంతో పాటు మరికొన్ని నాటకాలను ప్రదర్శిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి కళారంగంతో పాటు కళాకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.

10 ఏళ్లుగా పట్టించుకోని ప్రభుత్వాలు

గతంలో జనాభా నియంత్రణ, మద్యపాన నిషేదం, చదువు వెలుగు, పుష్కరాలు తదితర కార్యక్రమాలపై కళాకారులతో జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఇప్పించేవారు. పదేళ్లుగా ఎలాంటి కార్యక్రమాలు అప్పగించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళాకారుల పింఛన్లు కొన్నేళ్లుగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో 200మంది మాత్రమే పింఛన్లు మంజూరైన కళాకారులు ఉన్నారని, కొత్తవారికి పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా నిరుపేద రంగస్థల కళాకారులకు గుర్తించి ఆదుకోవాలని కోరుతున్నారు.



పేద కళాకారులను ఆదుకోవాలి



పేదరికంలో ఉన్న కళాకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి. సమాజ హితం కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న కళాకారులను పాలకులు పట్టించుకోకపోవడం సరికాదు. వెంటనే అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసి వారి సంక్షేమానికి నిధులు విడుదల చేయాలి.

భోనగిరి ప్రకాష్‌బాబు, హుజూర్‌నగర్ నియోజకవర్గం కళాకారుల సంఘం అధ్యక్షుడు

రంగస్థల కళాకారులను గుర్తించాలి



ఎంతోమంది ప్రజలకు తమ కళల ద్వారా వినోదం, ఆనందం పంచిన పంచుతున్న రంగస్థల కళాకారులను పాలక ప్రభుత్వాలు గుర్తించాలి. అంతరించిపోతున్న రంగస్థల నాటకాలను బతికించేందుకు, పూర్వవైభవం తెచ్చేందుకు కళాకారులకు సంక్షేమ ఫలాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి.

గుంటి పిచ్చయ్య, కళాకారుల సంఘం జిల్లా నాయకుడు

కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తా

మహిళా కూలీ మృతి, మరో ఆరుగురికి గాయాలు



ఘటనా స్థలంలో గుమిగూడిన ప్రజలు, దెబ్బతిన్న ఆటో

ఆత్మకూరు(ఎస్), ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తాపడిన ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెం దగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేట మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన 15మంది మహిళలు ఆత్మకూరు(ఎస్) మండలం బొప్పారం, శెట్టిగూడెం గ్రామాల్లో మిరపకాయలు ఏరే కూలి పనిమీద అదే గ్రామానికి చెందిన కేశరాజుపల్లి శంకర్ ఆటోలో తెల్లవారుజామున టేకుమట్ల నుంచి బయలుదేరి బొప్పారం, శెట్టిగూడెం గ్రామాలకు వెళ్తున్నారు. మార్గమధ్యలో కోటపహాడ్ గ్రామ శివారు చెరువు కట్ట వద్ద కుక్క అడ్డం రావడంతో ఆటోడ్రైవర్ తప్పించబోయే క్రమంలో ఆటో రోడ్డుపై పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలోని మహిళా కూలీ మాదరబోయిన యాదమ్మ(50) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆరుగురు మహిళా కూలీలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108వాహనంలో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. యాదమ్మ కుమారుడు మాదరబోయిన లింగయ్య ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ కేశరాజుపల్లి శంకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. యాదమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. యాదమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు

మామిడితోట దగ్ధం

నూతనకల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.10 లక్షల విలువైన మామిడితోట మంగళవారం సాయంత్రం దగ్ధమైంది. బాధిత రైతు కొలిచెల్మ సోమలింగయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని మామిడితోటకు ఆనుకుని ఉన్న వ్యవసాయ భూమిలో రైతు పత్తి కట్టెకు మంట పెట్టాడు. గాలికి ప్రక్కనే ఉన్న మామిడి తోటకు అంటుకుని సుమారు 70 మామిడిచెట్లు, సుమారు 200 టేకు చెట్లు, డ్రిప్ పైపులు, సుమారు రెండు టన్నుల మామిడికాయలు కాలి బూడిదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సుమారు రూ.10లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు. తనకు నష్టం కలిగించిన వారిపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాల్సిందే

శిశు విక్రయాలు ఇటీవల పెరుగుతున్నాయి. కన్నతల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులు, అమాయకత్వం, పిల్లలు లేని దంపతుల నిస్సహాయతను దళారులు శిశువుల క్రయవిక్రయాలు లేదా కిడ్నాపులకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే ఈ తరహా తతంగం అధికంగా జరుగుతున్నట్టు పలు సంఘటనలు రుజువు చేశాయి. శిశువు కిడ్నాపైన ప్రైవేట్ ఆస్పత్రుల లైసెన్స్ రద్దు చేయాలని సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేయడాన్ని అన్ని వర్గాలూ స్వాగతిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి- భువనగిరి టౌన్

సుప్రీం కోర్టు నిర్ణయం సరైందే



శిశువు కిడ్నాప్ అయిన ప్రైవేట్ ఆసుపత్రుల లైసెన్స్ రద్దు చేయాలంటూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలు విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నాం. ఈ తరహా అమానుషాలకు పాల్పడే ఆసుపత్రులు, వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐఎంఏ గతం నుంచే డిమాండ్ చేస్తోంది. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తే అందుకు బాధ్యులను కూడా చట్ట ప్రకారం శిక్షించాలి.

● డాక్టర్ ప్రభాకర్, అధ్యక్షుడు, ఐఎంఏ, యాదాద్రి భువనగిరి.

అమాయకులను మోసగిస్తున్నారు



శిశు విక్రయాలు, కిడ్నాపులలో దళారులు పలువురు అమాయకులను మోసగిస్తున్నారు. ఇందుకు కొన్ని ఆసుపత్రుల నిర్వాహకులు కూడా పరోక్షంగా సహకరిస్తున్నారు. పురిట్లోనే కన్న పిల్లలను దూరం చేసుకున్న వారిలో గిరిజనులే అధికంగా ఉంటున్నారు. దీంతో శిశు మార్పిడి చేసినా, విక్రయించేందుకు ప్రయత్నాలు చేసే దళారులను కఠినంగా శిక్షించాలి. సహకరిస్తున్న ఆసుపత్రుల, వైద్యుల లైసెన్స్‌ను రద్దు చేయాలి.

● డి సంతోష్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు, యాదాద్రి భువనగిరి.

మంచి నిర్ణయం



శిశువు కిడ్నాపులకు వేదికలవుతున్న ఆసుపత్రులపై నిషేదం కొరడాను సుప్రీం కోర్టు విదిల్చడం ఆలస్యంగానైనా సరైన నిర్ణయం తీసుకున్నది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు ప్రభుత్వాలు పట్టునట్లు ఉండడం బాధాకరం. ఇప్పటికైనా కోర్టు మార్గదర్శకాలను ప్రభుత్వం ఉపేక్షించొద్దు. సమాచారం అందిన వెంటనే కేసు నమోదు చేయడంతో పాటు ఆసుపత్రిని సీజ్ చేయాలి.

బొక్క రాంబాయి, రాష్ట్ర కో-ఆర్డినేటర్, జవహర్ బాల్ మంచ్.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట



శిశు కిడ్నాపులకు సహకరిస్తున్న ఆసుపత్రుల లైసెన్స్‌ను రద్దు చేయాలని సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలతో మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుంది. కిడ్నాపైన శిశువుల్లో కొందరిని పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తుండగా మరి కొద్ది మంది పిల్లలను మాఫియా ముఠాలకు విక్రయిస్తుండడంతో వారి భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతున్నది.

● ఆర్. స్వరాజ్యం, సీడీపీవో, ఐసీడీఎస్ ఆలేరు ప్రాజెక్టు.

ఇలాగే ప్రజల మన్ననలు అందుకోవాలి

● గ్రూప్-1కు 'ఆంధ్రజ్యోతి' ఉపయోగపడింది : డీటీసీ శ్రీవాణి
● యూనిట్ కార్యాలయంలో ఆంధ్రజ్యోతి కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల ప్రదానం



ద్వితీయ బహుమతి విజేత వెంకటేశ్వర్లుకు బహుమతి అందజేస్తున్న డీటీసీ శ్రీవాణి, డీటీవో లావణ్య

నల్లగొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఇలాగే ప్రజల మన్నలు అందుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీవాణి అన్నారు. బుధవారం నల్లగొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో 23వ వార్షికోత్సవ పురస్కారాలకు సంబంధించిన బహుమతులను ప్రదానం చేశారు. గత నెల 24వ తేదీన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో బహుమతులకు సంబంధించిన డ్రా తీసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో డీటీసీ శ్రీవాణి, డీటీవో, ఎంవీఐ ఐ. లావణ్య విజేతలకు ప్రథమ(బైక్), ద్వితీయ(ఫ్రిజ్), తృతీయ(టీవీ) బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీటీసీ శ్రీవాణి మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక తనకు ఎంతో ఉపయోగపడిందన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎంతో నాణ్యతతో మంచి వార్తలను ప్రచురిస్తూ ప్రజల మన్ననలు చూరగొంటుందన్నారు. సర్క్యులేషన్ కూడా అధికంగా ఉందని, మరింత సర్క్యులేషన్ పెరగాలని ఆకాంక్షించారు. బహుమతులను అందజేస్తూ పాఠకులను ప్రోత్సహించడం సంతోషంగా ఉందన్నారు. డీటీవో, ఎంవీఐ ఐ. లావణ్య మాట్లాడుతూ తాము విద్యార్థి దశలో ఎడ్యుకేషన్ పేజీని బాగా చదివేవారమని అన్నారు. తాను చదివిన పాఠశాల, కళాశాలల్లో ప్రత్యేకంగా దినపత్రికలు, పుస్తకాలు చదువుకోవడానికి ప్రత్యేకంగా తరగతి ఉండేదన్నారు. తాము చదివిన విషయాలను ఇతర విద్యార్థులకు వివరించేవారమని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే విషయాలు ఉంటాయన్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నదన్నారు. ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్‌రావు, బ్యూరో ఇన్‌చార్జి చల్లా సాంబశివారెడ్డి, ఏసీఎం ఉన్నం భాస్కర్, పీసీ ఇన్‌చార్జి పులిమామిడి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



ఆంధ్రజ్యోతి పాఠకుడిగా డ్రాలో విజేతగా నిలవడంతో పాటు మొదటి బహుమతి అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. కొన్ని సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిగా ఉన్నాను. బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఆంధ్రజ్యోతి దినపత్రికకు అభిమానిని. ప్రతిరోజూ తప్పనిసరిగా ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతా. వార్తల వల్ల తనకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతిఒక్కరూ ఆంధ్రజ్యోతి దినపత్రికను ఆదరించాలి.

వెలుగూరి కార్తీక్, (పథమ బహుమతి విజేత), రాయినిగూడెం, సూర్యాపేట జిల్లా

పత్రికకు వీరాభిమానిని



ఆంధ్రజ్యోతి పత్రికకు వీరాభిమానిని. తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నేను ఆంధ్రజ్యోతిలో వచ్చే వార్తలను స్పూర్తిగా తీసుకుంటాను. పాత ఆంధ్రజ్యోతి ఉన్నప్పటి నుంచి ఆంధ్రజ్యోతి పత్రిక చదివేవాడిని. 23 సంవత్సరాలుగా నిరంతరం పత్రిక చదువుతున్నాను. ఆంధ్రజ్యోతి సాహోసోపేతమైన పత్రిక. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా వార్తలను ప్రచురించడం సంతోషకరం.

● సిలివేరు వెంకటేశ్వర్లు (ద్వితీయ బహుమతి విజేత), చిలుకూరు మండలం, సూర్యాపేట జిల్లా

నిర్భయంగా వార్తలు ప్రచురించేది ఆంధ్రజ్యోతినే



ఆంధ్రజ్యోతి దినపత్రిక తటస్థంగా ఉంటుంది. నిర్భయంగా వార్తలు రాయడం ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రత్యేకత. అన్ని వర్గాల ప్రజల మన్నలను పొందుతోంది. ప్రతి వార్తను ప్రచురిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రజ్యోతి ప్రతి ఏటా డ్రాను ఏర్పాటు చేసి బహుమతులను ప్రధానం చేయడం సంతోషకరం. పాఠకుల ఆదరాభిమానాలను ఆంధ్రజ్యోతి మరింతగా చూరగొననుంది.

● పొనుగోటి శంకర్‌రావు (తృతీయ బహుమతి విజేత), నల్లగొండ.

మే 15 వరకు సెమిస్టర్ పరీక్షలు వాయిదా

● అయోమయంలో డిగ్రీ విద్యార్థులు ● మెట్టు దిగని ప్రభుత్వం ● పట్టు వీడని యాజమాన్యాలు

భువనగిరి టౌన్, నల్లగొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మే 15 వరకు వాయిదా పడ్డాయి. 3 సంవత్సరాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ఆరు నెలల బకాయి వేతనాలు చెల్లించాలంటూ లెక్చరర్స్ పరీక్షల బహిష్కరణ అస్త్రం ప్రయోగించడంతో ఈ నెల 11 నుంచి మే 6 వరకు జరుగాల్సిన డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు, 1, 3, 5వ సెమిస్టర్స్ సప్లమెంటరీ పరీక్షలను మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఈ నెల 16 వరకు వాయిదా వేసింది. అయినప్పటికీ బకాయిల చెల్లింపులో ప్రభుత్వం మెట్టు దిగకపోవడం, పరీక్షల బహిష్కరణలో యాజమాన్యాలు పట్టు వీడకపోవడంతో మే 15 వరకు పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఎంజీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బుధవారం ప్రకటించింది. ఇదే కారణంతో ప్రాక్టికల్స్ జరుగకపోగా థియరీ పరీక్షలు కూడా వాయిదా పడడంతో డిగ్రీ విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. పరీక్షలు వాయిదా పడుతుండడంతో 6వ సెమిస్టర్ పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు ఉన్నత విద్యలో ప్రవేశాలకు నిర్వహించే ఐ-సెట్, సీపీజీఈటీ, లా-సెట్ తదితర అర్హత పరీక్షలపై వత్తిడికి గురవుతున్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాల్సింది ప్రభుత్వం, పరీక్షలను నిర్వహించాల్సింది యాజామాన్యాలు కావడంతో ఇరువర్గాలు కూడా ఎవరికి

వారు పట్టుదలగా ఉండడంతో పరీక్షల నిర్వాహణపై ఎటూ తేల్చుకోలేని పరిస్థితి యూనివర్సిటీ వంతైంది. అయితే కళాశాలలకు రావాల్సిన రూ.100 కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేసి పరీక్షలను నిర్వహించి విద్యార్థులు భవిష్యత్తును కాపాడాల్సినబాధ్యత ప్రభుత్వానిదేనని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ప్రైవేట్, డిగ్రీ యాజామాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి, నల్లగొండలో ఎంజీయూ సిఓఈ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.

సంక్షోభాలన్నీ రాజకీయ సమస్యలే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): హక్కుల ఉల్లంఘనకు, పాలకుల నమూనా వల్ల వచ్చే సంక్షోభాలన్నీ రాజకీయ సమస్యలే అని మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ పి. సుబ్బారావు అన్నారు. మధ్యభారతంలో ఆదివాసీల హత్యాఖాండాను నిరసిస్తూ నల్లగొండ, గాంధీనగర్‌లో 19న జరిగే ఉమ్మడి జిల్లా సదస్సు కరపత్రాన్ని వివిధ సంఘాల నాయకులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బుధవారం ఆవిష్కరించారు. మధ్యభారత దేశంలోని అటవీప్రాంతంలో 18 రకాల విలువైన ఖనిజాలను బడా కార్పొరేట్లకు, పెట్టుబడిదారి సంస్థలకు కట్టబెట్టేందుకు ఆదివాసులను అడవులనుంచి తరిమివేసేందుకు ప్రభుత్వం సైనిక బలగాలను దించిందన్నారు. తీవ్రమైన హింసాకాండను అమలు చేస్తూ వందల సంఖ్యలో ఆదివాసుల హననానికి పాల్పడుతతున్నారని అన్నారు. తమ దేశ పౌరులపై తామే యుద్ధం ప్రకటించినట్లు ప్రభుత్వం చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. ఆదివాసీల హత్యాఖాండను పౌర ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీబావ వేదిక ఉమ్మడి నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, డీటీఎఫ్ నాయకులు వై. బిక్షమయ్య, డి.గణేష్, ముస్లిం విద్యావంతుల వేదిక నాయకులు మౌజం హుస్సేన్, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బి. రామయ్య, కిరణ్మయి, కుందా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం

(5వ పేజీ తరువాయి)

అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మాత్రం 4శాతం ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లా రవాణాశాఖకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో క్వార్టర్లీ, లైఫ్, సర్వీస్, గ్రీన్, డిటెక్షన్ ట్యాక్స్‌ల లక్ష్యం రూ.323కోట్లు కాగా, రూ.272కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.250కోట్ల మేర ఆదాయం లభించింది. ఆదాయంలో లైఫ్‌ట్యాక్స్ డిటెక్షన్‌ల ద్వారానే అధికంగా వచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం పెరగవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మృత్యు ఒడికి..

(ఆంధ్రజ్యోతి-చందంపేట)

నేరేడుగొమ్ము మండలం నాగార్జునసాగర్ వెనుక జలాలు వైజాగ్‌కాలనీలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు హైదరాబాద్, సుదూర ప్రాంతాల నుంచి యువకులు సెలవు దినాల్లో గడిపేందుకు వస్తుంటారు. సాగర్ వెనుక జలాల్లో బోటు సౌకర్యం ఉండడం, సహజంగా దొరికే చేపలు యాత్రికులను మరింత ఆకర్షిస్తుంటాయి. దీనికితోడు యువకులు ఈత రాకపోయినా సరదాగా వెనుక జలాల్లోకి వెళ్లడంతో మృతిచెందిన సంఘటలు ఉన్నాయి. ప్రమాదాలను నివారించేందుకు నేరేడుగొమ్ము పోలీసులు ప్రతిరోజు ఇద్దరు కానిస్టేబుల్‌లతో గస్తీ నిర్వహించడంతోపాటు సాయంత్రం 5 గంటలలోపు యాత్రికులు తిరిగి పంపిస్తున్నారు. సాగర్‌జలాల్లో లోతట్టు ఉండే ప్రాంతాలలో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ వద్ద ప్రమాదాలు జరగకుండా ఇద్దరు కానిస్టేబుళ్లతో గస్తీ ఏర్పాటు చేసి హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశాం. బోటింగ్‌కు సీనియర్ బోటింగ్ చేసే వారికే లోనికి అనుమతి ఇస్తున్నాం. ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటలలోపు పర్యాటకులు తిరిగి వెళ్లిపోయేలా చర్యలు చేపడుతున్నాం

● సతీష్, నేరేడుగొమ్ము ఎస్ఐ.

ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు లేకుండా..


(ఆంధ్రజ్యోతి-డిండి)



సందర్శకులు ప్రాజెక్టులోకి దిగకుండా ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన కంచె

డిండి రిజర్వాయర్‌లో ప్రమాదాలు జరగకుండా అధికారులు రక్షణ ఏర్పాటు చేశారు. పర్యాటకులు ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడుతుండడంతో నీటి పారుదలశాఖ అధికారులు ఎడమ ఎర్త్‌డ్యాం(మట్టికట్ట) 687.63 మీటర్ల పొడవున కట్ట ఎగువ, దిగువన రెండు వరుసలు ఇనుప జాలి(కంచె) బిగించారు. ప్రాజెక్టు నీటిలోకి వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు. బ్యాక్ వాటర్‌లో ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ ఏర్పాట్లు, హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. ప్రధాన కాల్వల వెంట రక్షణ చర్యలు తీసుకోలేదు. తన తాత ఖర్మకాండకు వచ్చి 2014 జూలై 30వ తేదీన స్నానాల కోసం నీటిలోకి దిగి ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు యువతులు, ఇద్దరు యువకులు నీట మునిగి మృతిచెందారు. 818.34 మీటర్ల పొడవు ఉన్న డిండి ప్రాజెక్టు కుడిఎర్త్ డ్యాంపై ఇనుప జాలీ బిగించలేదు. కుడివైపున ప్రమాదాలు జరగకుండా ఎలాంటి కాపలా ఏర్పాటు చేయలేదు.

విహారయాత్రలకు వెళ్లే ముందు ఇలా..



- విహారయాత్రకు వెళ్లే ముందు ప్రాజెక్టు గురించిన సమాచారం తెలుసుకోవాలి
- ప్రాజెక్టు ప్రాంతంలోని భద్రత ఏర్పాట్ల గురించి పూర్తిగా తెలుసుకోవాలి
- విపత్తు అనంతర ప్రాంతాన్ని సందర్శించుటప్పుడు, రికవరీ ప్రయత్నం స్థితి పరిశోధన చేయాలి
- అక్కడ ఏఏ ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉన్నాయో పరిసర ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకోవచ్చు.
- ప్రమాదకరమని అధికారులు హెచ్చరించిన ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దు

కనిపించని హెచ్చరిక బోర్డులు




శాలిగౌరారం ప్రాజెక్టులో అక్రమ మట్టి తొలగింపుతో ఏర్పడిన గుంతలు

(ఆంధ్రజ్యోతి-శాలిగౌరారం)

నల్లగొండ జిల్లా శాలిగౌరారం ప్రాజెక్టులో కొంతమంది ఇష్టానుసారం మట్టి తరలించడంతో ఆ ప్రాంతంలో పెద్ద ఆగాదాలు ఉండటం, బావులు తీయడంతో ప్రాజెక్టులో నీరు ఉన్నపుడు కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవిలోలో ఈ ప్రాంతం సరదాగా ఈతకు వచ్చిన వారు లోతు తెలియక మునిగి మృత్యువాత పడుతున్నారు. ఇక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో మూగ జీవాలు, మనుషులు వచ్చి మృత్యువాతపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాక్ వాటర్‌లో ఈత నిషేధం



(ఆంధ్రజ్యోతి-మేళ్లచెర్వు)

సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో ఈత కొట్టడం నిషేధం. ప్రాజెక్టు ఎగువభాగాన నీటిమట్టం అధికంగా(34 టీఎంసీలు) ఉండడం, కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో అనేక సందార్భాల్లో మొసళ్లు సంచరిస్తుంటాయి. దీంతో పర్యాటకులకు ప్రమాదం పొంచి ఉంది. నదిలో వరద ప్రవాహానికి బురియలు, లోయలు, ఏర్పడుతుంటాయి. దీంతో కృష్ణానదిలో ప్రాజెక్టు ఎగువ భాగాన, దిగువ భాగాన పూర్తిస్థాయిలో ఈత నిషేధించామని, యువకులు అవగాహన రాహిత్యంగా నదిలో ఈతకు వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని చింతలపాలెం ఇన్‌చార్జి ఎస్ఐ పరమేష్ తెలిపారు. అప్రమతంగా ఉండాలని నదీ పరివాహక ప్రాంత గ్రామాల్లోని నది ఒడ్డున హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

అప్రమత్తంగా ఉందాం

● సెలవు రోజుల్లో ప్రాజెక్టులు, నదులు, చెరువుల వద్దకు పర్యాటకులు ● కనిపించని హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు

ప్రకృతి అందాలను ఆస్వాదించాలని, జలకళను కళ్లారా చూడాలని ఉవ్విళ్లూరే పర్యాటకులు ఉంటారు. వేసవి వచ్చిందంటే సరదాగా విహార యాత్రలకు వెళ్తుంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు ఔత్సాహికులు సుదూర ప్రాంతాల నుంచి జలపాతాలు, ప్రాజెక్టులు, నదులు, చెరువుల వద్దకు వెళ్తుంటారు. ప్రాజెక్టులు, బావులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు పిల్లలు, యువకులు ఉత్సాహం చూపుతుంటారు. ఈత సరదా కొన్ని సందర్భాల్లో విషాదాంతంగా ముగుస్తుంటుంది. ఇలాంటి ప్రాంతాల్లో అధికారులు హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. దీనికి తోడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

సాగర్‌కు భారీగా పర్యాటకులు

(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)



నాగార్జునసాగర్ జలాశయం చుట్టూ వేసిన సోలార్ ఫెన్సింగ్

సాగర్ అందాలను తిలకించేందుకు సెలవు దినాల్లో వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జున సాగర్‌కు వస్తుంటారు. నీళ్లలో సరదాగా ఆడుకోవడానికి పిల్లలు, పెద్దలు ఉత్సాహం చూపుతుంటారు. సర దాగా గడిపే సమయంలో జలాశయంలో దిగే పర్యాటకులు లోతు తెలియక ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. సాగర్‌లో ఉన్న సమ్మక్క-సారక్క పుష్కరఘాట్ (దయ్యాలగండి), పైలాన్‌కాలనీలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రం దిగువన ఉన్న వీఐపీ పుష్కరఘాట్(శివాలయం) వద్ద పర్యాటకులు నదిలోకి ఈత కొట్టడానికి దిగుతూ ఉంటారు. ఈ క్రమంలో దయ్యాలగండి వద్ద నది లోతుగా ఉండడంతో పాటు శివాలయం పుష్కర ఘాట్ వద్ద ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి వచ్చే వరద ప్రవాహానికి, అదేవిధంగా క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే సమయంలో పర్యాటకులు ప్రవాహంలో కొట్టుకుపోయే వారు. తొలి ఏకాదశి, కార్తీకమాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో భక్తులు నది స్నానానికి అధిక సంఖ్యలో శివాలయం ఘాట్ వద్దకు వెళ్తారు. ఈ క్రమంలో కూడా కొందరు ప్రాణాలు కోల్పోయారు. వారాంతరాల్లో హైదరాబాద్ నుంచి సాఫ్ట్‌వేర్‌లు, ఉద్యోగులు సాగర్‌కు వస్తుంటారు. ఈ క్రమంలో సాగర్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో దారిలోనే ఉన్న దయ్యాలగండి వద్ద జలాశయంలోకి దిగి పర్యాటకులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. పర్యాటకుల ప్రాణాలను కాపాడేందుకు నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపడుతున్నారు.

సాగర్ జలాశయం వద్ద చేపట్టిన రక్షణ చర్యలు

- నాగార్జునసాగర్ జలాశయం చుట్టూ సోలార్ పెన్సింగ్ ఏర్పాటు
- పుష్కరఘాట్‌ల వద్ద నదిలోకి ఎవరూ దిగ వద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- దయ్యాలగండి వద్ద జలాశయంలోకి ఎవరు వెళ్లకుండా ముళ్ల కంచె ఏర్పాటు
- క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే క్రమంలో శివాలయం ఘాట్ వద్ద దారి పూర్తిగా మూసివేత
- ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు విడుదల చేసే సయంలో సైరన్ మోగిస్తున్నారు.
- కొత్త వంతెన వద్ద పోలీసుల నిరంతర పెట్రోలింగ్
- నీటిని దిగువకు విడుదల చేసే సమయంలో శివాలయం ఘాట్‌కు వెళ్లే మార్గంలో పటిష్ఠ పోలీస్ భద్రత
- పండుగల సమయంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రక్షణ కోసం గజ ఈతగాళ్లను, పుట్టీలను, మరపడవలను ఏర్పాటు
- సాగర్ ప్రాజెక్టు ఎర్తు డ్యాంల పై, ప్రధాన డ్యాం పై సీసీ కెమెరాల ఏర్పాటు. దీంతో జలాశయంలోకి ఎవరు దిగిన వెంటనే కంట్రోల్‌రూం నుంచి ఆయా ప్రదేశాల్లో పోలీసులు పహారా కాస్తూ అప్రమత్తం చేస్తున్నారు.
- సాగర్‌కు వస్తున్న పర్యాటకులకు పోలీసులు తగు సూచనలు చేస్తున్నారు. నదిలోకి ఎవరూ దిగవద్దని అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

వేసవిలోనూ జలకళ



(ఆంధ్రజ్యోతి-కేతేపల్లి)

మూసీ ప్రాజెక్టు వేసవిలోనూ జలకళ సంతరించుకుంటుంది. ఈ ఏడాది యాసంగిలో ఆయకట్టుకు సాగునీటి విడుదల నిలిపివేసిన తర్వాత 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 622అడుగుల డెడ్‌స్టోరేజీకి పడిపోయింది. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు మూసీ పరీవాహక గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలకు మూసీ రిజర్వాయర్ నీటిమట్టం ప్రస్తుతం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తుంది. వర్షాలు లేకున్నా హైదరాబాద్ డ్రైనేజీ నీరంతా దిగువన గల మూసీకి వస్తుండడంతో ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ఈనెల 5నాటికి 622అడుగుల కనిష్ఠ నీటినిల్వకు పడిపోయిన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి ఐదు అడుగుల మేర పెరిగి 627.10అడుగులుగా నమోదైంది. ఎగువ నుంచి 281.36క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. ఖరీఫ్ ఆరంభంలో వచ్చే వర్షాలతో ప్రాజెక్టులోకి కొద్దిపాటి నీరు చేరినా ఈ ప్రాజెక్టు అక్టోబరు నవంబరు నెలల్లో వచ్చే తుపాను వర్షాలు లేదా ఈశాన్య రుతుపవనాల వల్ల వచ్చే వర్షాలకు మాత్రమే పూర్తి స్థాయిలో నిండేది. అయితే కొన్నేళ్లుగా వేసవిలోనే ఈప్రాజెక్టు జలకళ సంతరించుకుంటుంది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడం వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి వ్యవసాయ బావులు, తాగునీటి బోర్లలో నీరు సమృద్ధిగా లభిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. అలాగే వేసవిలో మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు ఉండవంటున్నారు.



చిట్యాల మునిసిపల్ కమిషనర్‌గా శ్రీను

చిట్యాల, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): చిట్యాల మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా శ్రీను బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీను బదిలీపై చిట్యాలకు రాగా ఇక్కడ పనిచేస్తున్న వీరేందర్ పదోన్నతిపై మెప్మా ఏడీగా హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీను మాట్లాడుతూ మునిసిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధిన బారిన పడకుండా పశువులకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారులు రవినాయక్, భార్గవ్‌సంతోష్ అన్నారు. పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామని, ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం నార్కట్‌పల్లిలో గాలికుంటు టీకాలను వేశారు. కార్యక్రమంలో వీఎల్‌వో యాదయ్య, దుర్గాభవాని, గోపాలమిత్రలు వెంకన్న, రమేష్, భాస్కర్, అంజి, రియాజ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి

గట్టుప్పల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. నాణ్యమైన కరెంట్ అందించకపోవడంతో ఎండిన పంటలకు ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, సీపీఎం సీనియర్ నాయకుడు చాపల మారయ్య, నాయకులు కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్, అచ్చిని శ్రీనివాస్, బొట శివకుమార్, నరసింహ, వెంకటేశం, రాములు, శ్రీశైలం, యాదగిరి, రాములమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది : చిరుమర్తి



సమావేశంలో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ సభ నుంచే కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. వరంగల్‌లో ఈ నెల 27న తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం చిట్యాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఏడాదిన్నర కాలంలో అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనలో విసిగిపోయినట్లు తెలిపారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ సభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, నాయకులు సుంకరి యాదగిరి, కొలను వెంకటేష్, రాచకొండ కిష్టయ్య, సైదులు, అశోక్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ వేణుగోపాల్

చండూరురూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.వేణుగోపాల్ అన్నారు. మండల పరిధిలోని బంగారిగడ్డ రైతు వేదికలో బుధవారం నిర్వహించిన విత్తన, పురుగుమందులు, ఎరువుల దుకాణదారులు, డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సకాలంలో అందించాలని సూచించారు. అదే విధంగా డీలర్లు తప్పనిసరిగా చట్టాలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ వానాకాలం పత్తి బీటీ 2 విత్తన రకాల ధర రూ.901లుగా ప్రభుత్వం నిర్ణయించిందని, రైతులకు ఎమ్మార్పీ ధరకే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మాలని లేనిచో కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకొని పంట కాలమైపోయే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మునుగోడు టెక్నికల్ ఏవో పి.మల్లేష్, ఏవో చంద్రిక, ఏఈవోలు బాలరాజు, నాగార్జున, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

మునుగోడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య అన్నారు. మునుగోడులో తొలివిడతలో భాగంగా వచ్చిన టీడీపీ సభ్యత్వ కార్డులను బుధవారం ఆయన పార్టీ కార్యకర్తలకు అందజేశారు. టీడీపీ కార్యకర్తలకు అసలైన గుర్తింపు పార్టీ సభ్యత్వ కార్డులేనని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచిన పార్టీ టీడీపేనని పేర్కొన్నారు. పార్టీ సభ్యత్వాలను స్వచ్ఛందంగా తీసుకునేందుకు కార్యకర్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారు రఘు, నాయకులు చిన్న నర్సింహ, ఇటుకలపాటి ఆరోగ్యం, సత్తయ్య, జగాలు, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ సహదేవరెడ్డికి మాతృవియోగం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల

కనగల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చుగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కనగల్ పీఏసీఎస్ చైర్మన్ వంగాల సహదేవరెడ్డి మాతృమూర్తి వంగాల రాములమ్మ (97) వృద్ధాప్య సమస్యల కారణంగా బుధవారం ఉదయం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, జీఎడవల్లి సింగిల్‌విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కరీంపాష, మాజీ వైస్‌ఎంపీపీ రామగిరి శ్రీధర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐతగోని యాదయ్యగౌడ్, నాయకులు బల్గూరి మల్లయ్యగౌడ్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, మల్లేష్, లింగయ్య, గోవర్ధన్ తదితరులు రాములమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుమారులైన సహదేవరెడ్డి, యాదవరెడ్డిలను పరామర్శించి ఓదార్చారు.

దాహం తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటు

చండూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రైతన్నల దాహం తీర్చడం కోసమే చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్‌రామ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కస్తాల, గుండ్రపల్లి, బంగారిగడ్డ, పుల్లెంల, కొండాపురం, అంగడిపేట ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బుధవారం ఆయన చలివేంద్రాలను ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కోడి సుష్మవెంకన్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చలివేంద్రాలలో ప్రతీరోజు చల్లటి వాటర్ టిన్నులను ఏర్పాటు చేసి రైతన్నలకు తమవంతు సహకారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ గుండమల్ల శ్రీనివాసులు, డైరెక్టర్ కట్ట బిక్షం, ఏవో చంద్రిక, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్వాయి అమరేందర్‌రెడ్డి, లక్ష్మి, భూతరాజు ఫణి, ఫౌండేషన్ సభ్యులు పిన్నింటి నరేందర్‌రెడ్డి, నకిరెకంటి లింగస్వామి, శ్రీహరి, రామకృష్ణ, రాజు, రఘు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో బుధవారం మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకునే విధంగా లేబర్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల బోగస్ కార్మికులకు కూడా లేబర్ కార్డు తీసుకున్నారని అన్నారు. ఆన్‌లైన్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత పనిచేసే కార్మికులకు వేలిముద్రలు పడకుండా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దోటి వెంకన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం అంతంతే..

- రాంనగర్ పార్క్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- విరిగిన పరికరాలు
- అర్బన్ పార్క్‌కు తాళం తీస్తే ఒట్టు...
- రూ.3 కోట్లు బూడిదలో పోసిన పన్నీరే

రామగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్లాదం కోసం సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కుల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఆనందం కోసం వెళ్తే ఇబ్బందులు తప్పడం లేదు. పిల్లల సరదా కోసం పట్టణంలోని రాంనగర్ పార్క్, చర్లపల్లి అర్బన్‌పార్క్, రాజీవ్ పార్క్‌లు ఏర్పాటు చేశారు. ఈ పార్కుల్లో ప్రజలు కాసేపు సేద తీరుదామని వస్తే వారికి ఎన్నెన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. రాంనగర్ పార్క్‌లో సీసీ కెమెరాలు కొంతకాలంగా పనిచేయడం లేదు. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట పరికరాలు ధ్వంసమై సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇకపోతే రాజీవ్‌పార్క్‌లో సమస్యలు చెప్పనలవి లేకుండా ఉన్నాయి. పిల్లలు ఆడుకునే పరికరాలు విరిగిపోవడంతో పాటు మూత్రశాలలు ఏర్పాటు చేసినా నీటి సరఫరా లేకపోవడంతో అధ్వానంగా తయారై నిరుపయోగంగా మారాయి. దీంతో అక్కడికి వచ్చిన ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

అర్బన్ పార్క్‌కు తాళం తీస్తే ఒట్టు

పట్టణంలోని చర్లపల్లి ప్రాంతంలో మూడేళ్ల క్రితం నల్లగొండ పట్టణానికే తలమానికంగా ఉండాలన్న ఉద్దేశంతో అప్పటి అధికారులు, పాలకులు సుమారు రూ.3 కోట్లతో వ్యయంతో పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు స్థలం అనువుకాదని తెలిసినా హైవే వెంట



అర్బన్ పార్క్‌లో మేతకోసం వచ్చిన బర్రెలు



మొండిగా దర్శనమిస్తున్న చెట్లు

వచ్చిపోయే వారు చూడాలన్న ఉద్దేశ్యంతోనే ఇక్కడ పార్క్‌ను నిర్మించారన్న ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. అయితే రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన పార్క్ గేటుకు నేటి వరకు తాళం తీయలేదు. కనీసం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. అధికారులు లాంఛనంగా ప్రారంభించకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కొంతమంది తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి మందు తాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా పార్క్ పశువుల మేతకు కోసం రావడం ఆ పార్క్ పరిస్థితి ఎంతో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పార్క్ నేటి వరకు కూడా ప్రారంభానికి నోచుకోలేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.

సీసీ కెమెరాల నిర్వహణకు టెండర్ పిలుస్తాం



రాంనగర్ పార్క్‌లో గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. అయితే కెమెరాలకు సంబంధించిన తీగలను కోతులు ధ్వంసం చేయడంతో అవి పనిచేయడం లేదు. తిరిగి వాటి నిర్వహణకు టెండర్లు పిలిచే పనిలో ఉన్నాం. పార్కులను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అర్బన్ పార్క్ ప్రారంభం అనేది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్‌గా మురళి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యోగ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్స్ జేఏసీ (టీజీఈజేఏసీ) చైర్మన్‌గా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్లగొండ పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జేఏసీ అధ్యక్షుడిగా నాగిళ్ల మురళి, సెక్రటరీ జనరల్‌గా టీజీవో అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా డీవీఎస్ ఫణికుమార్, కోచైర్మన్లుగా పి.వెంకటేశం, కృష్ణమూర్తి, ఏ.బిక్షామయ్య, తరాల పరమేష్, కె.రత్నయ్య, టి. వెంకులు, వెంకటరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా టీఎన్‌జీవోఎస్ జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, బాలరాజుగౌడ్, వైస్ చైర్మన్‌గా రాంబాబును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నాంపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ దేవాసింగ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఏవో శివకుమార్, ఏపీఎం వినోద్, నాయకులు ఇందిర, వెంకటమ్మ, భవాని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం : సీఐటీయూ



ధర్నాలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు చేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీపీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని కోరారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని అర్హత కలిగిన కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని, బిల్ కలెక్టర్ కారోబార్లకు ప్రత్యేక హోదా కల్పించాలని కోరారు. మల్టీ పర్పస్ పేరుతో కార్మికులను వేధించడం ఆపాలని, ఎండలు తీవ్రంగా ఉన్నందున కార్మికులతో ఒక్కపూట పనులే చేయించాలని, ఆన్‌లైన్‌లో లేని కార్మికుల పేర్లు వెంటనే నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, నాయకులు పొన్న అంజయ్య, పి.సర్వయ్య, ఎర్ర అరుణ, నరసయ్య, జానయ్య, రామలింగయ్య, ఎండీ.జహీర్, పి.చంద్రయ్య, సైదులు, మరియమ్మ, రమేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : వీరేశం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మునిసిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నకిరేకల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం షార్ట్‌సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధమైన పజ్జూరు కృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే వీరేశం పరామర్శించారు. ఇంట్లో సామగ్రి మొత్తం దగ్ధమైందని వాపోయాడు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు దుస్తువులు, ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను వెంటనే పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నకిరేకల్ మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, కమిషనర్ బాలయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు గాజుల సుకన్య శ్రీనివాస్, ఘర్షకోటి సైదులు, రాచకొండ సునిల్, గడ్డం స్వామి, నాయకులు లింగాల వెంకన్న, వెంకన్న, రాజు, రవి, యాదగిరిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి

నల్లగొండరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని అర్హులైన పేదలకు పింఛన్, రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుల లో చేర్పుల, మార్పులకు అవకాశం ఇవ్వాలని కోరారు. మహిళా పొదుపు సంఘాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలిబోయిన వరలక్ష్మి, కొండ అనురాధ, జిట్లా సరోజ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మింగేశారు

(5వ పేజీ తరువాయి)

తెరలేచింది. పైపులైన్ నిలిచిపోవడంతో భూములకు ఇబ్బంది లేదంటూ పాల్తీతండ, జైరాంతండాలో ప్రచారం చేయడంతో రైతులు పరిహారం గురించి పట్టించుకోలేదు. దీంతో అప్పటి పర్వేదుల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తి అనారోగ్యంతో ఉండటంతో అతడి కుమారుడు అనధికార విధులు నిర్వహిస్తూ రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి పరిహారం కాజేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన రెండు చెక్కుల్లో ఒకటి రూ.25.86లక్షలు కాగా, దీన్ని స్థానిక ఎస్‌బీఐలో జమ చేశారు. మరో రూ.12లక్షల చెక్కును ఏ బ్యాంకులో జమచేశారన్న విషయంలో స్పష్టత లేదు. లబ్ధిదారులకు పరిహారం అందజేయకుండానే అక్విటెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు కాజేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయంలో సైతం దీనికి సంబంధించిన రికార్డులు లేవని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

నిధుల స్వాహావెలుగులోకి...

రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించింది. 2021లో రూ.20వేల కోట్లతో మేఘా సంస్థకు నిర్మాణపనులు అప్పగించింది. 11కిలోమీటర్ల పైపులైన్ పనులు కొనసాగుతుండగా, 2023లో పర్వేదుల రెవెన్యూ శివారులోని 92 సర్వే నెంబర్ భూమి వద్దకు రాగానే రైతు జైపాల్‌రెడ్డి పైపులైన్ పనులను అడ్డగించాడు. ప్రభుత్వం తన భూమిని సేకరించలేదని, తనకు పరిహారం అందజేయలేదని అధికారులకు వివరించారు. దీంతో వారు నిర్వాసితుల జాబితాను పరిశీలించగా 6.05 ఎకరాలకు రూ.1,77,000 పరిహారం చెల్లించినట్టు జాబితాలో ఉండటంతో అతడు అవాక్కయ్యాడు. అతడికి 93 సర్వేనెంబర్‌లో, అతడి అన్నదమ్ములు ఘట్టారెడ్డికి 80, 88 సర్వే నెంబర్‌లో, సాయి శరత్‌రెడ్డికి 91 సర్వేనెంబర్‌లో వేర్వేరు పట్టాలు ఉన్నప్పటికీ, అందరివి కలిపి జైపాల్‌రెడ్డికే పరిహారం ఇచ్చినట్టు జాబితాలో ఉంది. ఇలా సుమారు 15 నుంచి 20 మంది రైతులకు చెందిన ఫోర్జరీ సంతకాలతో పరిహారాన్ని మింగేసినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు స్పందించి లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నక్సల్స్ ఇళ్లు పేల్చివేయడంతో



పైపులైన్ వచ్చేమార్గంలో నా భూమి కోసం నిర్మించిన పెద్ద నీటి ట్యాంక్ ఉంది. దీంతో భూసేకరణకు నేను అంగీకరించలేదు. అదే సమయంలో 1999 డిసెంబరు 13న నక్సలైట్లు పర్వేదులలో నా ఇంటిని బాంబులతో పేల్చివేశారు. దాంతో ఐదారేళ్లపాటు ఊరికి దూరంగా ఉండాల్సివచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని నాకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేశారు. అప్పటి ఆర్డీవో సమక్షంలోనే నిధుల స్వాహా జరిగింది. గతంలో పెద్దవూర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. సదరు అధికారి సొంత మండలంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తుండటంతో చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.

- జైపాల్‌రెడ్డి రైతు, పర్వేదుల, పెద్దవూర మండలం

విచారణకు ఆదేశించాం



సుంకిశాల-కోదండాపూర్ భూనిర్వాసితుల పరిహారం విషయంలో అవకతవకలపై ఫిర్యాదులు అందాయి. శాఖాపర విచారణకు ఆదేశించాం. నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం.

- నారాయణ అమిత్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఎం.వేణుగోపాలాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ తీగలకు అడ్డుగా వస్తున్న చెట్ల నరికివేతతో పాటు మెయింటనెన్స్‌లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శాంతినగర్ ఫీడర్, డీవీకే 11కేవీ ఫీడర్, ఎస్ఎల్‌బీసీ టౌన్ ఫీడర్ల పరిధిలోని మాన్యం చెల్క, లిటిల్‌ఫ్లవర్ స్కూల్, శాంతినగర్, ముషంపల్లిరోడ్డు, హైదర్‌ఖాన్‌గూడ, రెహమత్‌నగర్, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, డీఎంహెచ్‌వో, రైతుబజార్, డీఈవో ఆఫీస్, జూనియర్ కాలేజ్, సెయింట్ అల్ఫోన్సెస్ స్కూల్, జైల్‌ఖానా, సిద్ధార్థ కాలనీ, అబ్బాసియాకాలనీ, సాయినగర్, చైతన్యపురి కాలనీ, గంధవారిగూడెం రోడ్డు, లూయిజ్‌నగర్ కాలనీ, లెప్రసీ హాస్పిటల్ ఏరియా, గణేష్‌నగర్, దుప్పలపల్లి రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు



విద్యుత్ తీగలను కొత్త స్తంభంపైకి మార్చుతున్న ట్రాన్స్‌కో సిబ్బంది

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపలాయపల్లి గ్రామంలో విద్యుత్ తీగల సమస్యపై 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడటానికి గల కారణాలను గుర్తించారు. పాత స్తంభం ఎత్తు తక్కువగా ఉండటం, లూప్‌లైన్‌గా తీగలు మారడంతో చేతికందే ఎత్తులోకి వేలాడినట్లు తెలుసుకున్నారు. 9.2 మీటర్ల ఎత్తు ఉన్న మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో బాధిత గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు వెంటనే చెల్లించాలి

చండూరురూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు వెంటనే చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా కోశాధికారి బొమ్మరబోయిన సైదులు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పేస్కేల్ వర్తింపజేయాలని, కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఖమ్మం శ్రీనివాస్, బరిగెల వెంకన్న, దామర అరుణ, నలపరాజు కవిత, అన్నెపాక రామరాజు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు సలీం, సత్తయ్య


నల్లగొండ రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో లాటరీ ద్వారా ఎంపిక చేసిన డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లను వెంటనే ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి.సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. లాటరీ ద్వారా ఎంపిక చేసిన 552 మందికి ప్రొసిడింగ్‌లను వెంటనే ఇవ్వాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఇళ్లను ఇవ్వాలని నాలుగు నెలలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు, అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం సాధన కమిటీ కన్వీనర్ అవుట రవీందర్, సీపీఎం పట్టణ నాయకులు తుమ్మల పద్మ, నర్సింహ, అశోక్‌రెడ్డి, ప్రశాంతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

నల్లగొండ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నల్లగొండ సమీపంలోని చర్లపల్లిలో డీవీఎం విద్యా సంస్థల ప్రాంగణంలో శ్రీ ఎలమంద కోటేశ్వర ఆలయ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా రాత్రి చర్లపల్లిలో స్వామి అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీవీఎం విద్యాసంస్థల నిర్వాహకులు దొడ్డ నాగరాజు, శాంతకుమారి, దొడ్డ శాంతికుమార్, నందిని, దొడ్డ సాయి సంజయ్, దొడ్డ శ్రావ్యతో పాటు చొల్లేటి శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 23.0

గ్రూప్-1కు 'ఆంధ్రజ్యోతి' ఉపయోగపడింది



- డీటీసీ శ్రీవాణి
- దినపత్రికల పఠనంతో విజ్ఞానం పెరుగుతుంది : డీటీవో లావణ్య
- 'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ విజేతలకు బహుమతుల ప్రదానం •7లో..

'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ ప్రథమ బహుమతి విజేత వెలుగూరి కార్తీక్‌కు చెక్ అందజేస్తున్న డీటీసీ శ్రీవాణి, చిత్రంలో డీటీవో లావణ్య, 'ఆంధ్రజ్యోతి' బ్రాంచ్ మేనేజర్ దాసరి చంద్రశేఖర్‌రావు

మే 15 వరకు సెమిస్టర్ పరీక్షలు వాయిదా



హైదరాబాద్‌లో ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధులు

- అయోమయంలో డిగ్రీ విద్యార్థులు
- మెట్టుదిగని ప్రభుత్వం
- పట్టువీడని యాజమాన్యాలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్
- పరీక్షలపై బహిష్కరణ అస్త్రం
- విద్యార్థులకు నష్టమే

•7లో..

రవాణాశాఖ లక్ష్యానికి
తగ్గిన ఆదాయం



- లక్ష్యం రూ.323కోట్లకు రూ.272కోట్ల రాబడి
- 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 4శాతం అధికం

కోదాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రధానంగా రవాణాశాఖ పన్నులు, మద్యం, రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా ఆదాయం వస్తుంది. రియల్టీ రెండేళ్లుగా తగ్గినా, ఎల్ఆర్ఎస్ చార్జీల పెంపుతో రిజిస్ట్రేషన్లశాఖ ద్వారా నిలకడగా ప్రభుత్వానికి ఆదాయం లభించింది. మద్యం ధరల పెంపుతో గత ఏడాదితో పోల్చితే ప్రభుత్వ ఆదాయం తగ్గింది. బీర్ల ధరల పెరుగుదలతో ఎక్సైజ్‌శాఖ వచ్చే రాబడి సుమారు 5శాతం మేర తగ్గింది. రవాణాశాఖ సైతం లక్ష్యం మేర ఆదాయం సాధించలేకపోయింది. అయితే మిగతా 7వ పేజీలో...

జిల్లాల వారీగా రవాణాశాఖకు వచ్చిన రాబడి ఇలా..

పన్నులు	నల్లగొండ		సూర్యాపేట		యాదాద్రి		మొత్తం (రూ.కోట్లలో)	
	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు	లక్ష్యం	వసూలు
క్వార్టర్లీ ట్యాక్స్	51.64	40.53	39.76	32.76	33.28	25.07	124.68	98.36
లైఫ్ ట్యాక్స్	10.76	9.06	66.72	55.45	56.88	47.63	134.36	112.10
సర్వీస్ ట్యాక్స్	6.00	5.30	3.96	3.3	3.00	2.45	12.96	11.06
గ్రీన్ ట్యాక్స్	12.24	10.57	12.00	9.5	12.00	9.6	14.64	12.48
డిటెక్షన్ ట్యాక్స్	28.20	30.10	5.64	5.30	2.88	3.04	36.72	38.44

పరిహారం మింగేశారు

- ఫోర్జరీ సంతకాలతో నిధులు స్వాహా
- సుంకిశాల ప్రాజెక్టు పైపులైన్ నిర్వాసితులకు దక్కని పరిహారం
- ఆర్డీవో కార్యాలయ కేంద్రంగా నిధుల కైంకర్యం
- 20 ఏళ్ల తరువాత వెలుగులోకి

జంట నగరాలకు తాగునీరందించే లక్ష్యంతో సుమారు రూ.5వేల కోట్ల అంచనాతో 1998లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ నిర్మాణ పనులకు 47.16ఎకరాల భూసేకరణ చేశారు. కాగా, నిర్వాసితులకు అందాల్సిన పరిహారాన్ని కొందరు అవినీతి అధికారులు మింగేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్వాసిత రైతుల పేరు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ కావాల్సిన నగదును సంతకాల ఫోర్జరీలతో నేరుగా డ్రాచేసి లక్షల రూపాయలు కాజేసినట్లు సమాచారం. దీంట్లో పెద్దవూర మండలం పర్వేదులకు చెందిన ఓ గ్రామస్థాయి అధికారి కుమారుడు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నాటి ఆర్డీవో కార్యాలయ కేంద్రంగా అవినీతి జరిగిందని ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, అధికారులు మౌనంగా ఉన్నారు. సుమారు 64 మంది లబ్ధిదారులకు అందాల్సిన పరిహారాన్ని 40మంది రైతులకే అందజేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వాలు మారడంతో మధ్యలో నిలిచిన పైపులైన్ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ ప్రారంభించడంతో నిర్వాసితుల పరిహారాన్ని కాజేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

● ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ



పర్వేదుల గ్రామ సర్వే నెం.93 వరకు వచ్చి నిలిచిన పైపులైన్ పనులు

పుట్టంగండి నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని తరలిస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 510 అడుగుల నీరు ఉంటనే పుట్టంగండి నుంచి నీటిని అక్కంపల్లి రిజర్వాయర్‌కు తరలించే అవకాశం ఉంది. 510 అడుగులకంటే తక్కువ నీటి లభ్యత ఉన్న సందర్భాల్లో జంటనగరాలకు నీటి ఎద్దడికి అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగర్ ప్రాజెక్టులో 480 నుంచి 490 అడుగుల వద్ద నీరు ఉన్నా కృష్ణాజలాలను తరలించేందుకు నదీ తీరంలోని సుంకిశాల నుంచి పర్వేదుల, సంగారం, పోతునూరు, కోదండాపూర్ వరకు పైపులైన్ నిర్మించి అక్కడ నీటిని ఫిల్టర్ చేసి హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో భాగంగా 1998లో భూసేకరణకు నాటి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

నష్టపరిహారం ఎకరాకు రూ.50వేలు

సుంకిశాల వద్ద కౌంపౌండ్ వాల్ నిర్మించి పైపులైన్ కోసం సేకరించే భూమికి తరి ఎకరాకు రూ.50వేలు, మెట్టకు రూ.30వేలు పరిహారం నిర్ధారించి 1999లో భూసేకరణ చేశారు. పర్వేదుల రెవెన్యూ పరిధిలో 64 మంది రైతులకు చెందిన 47.16 ఎకరాల భూమి సేకరించాలని అధికారులు గుర్తించారు. అందులో కొందరు రైతులు భూమి ఇచ్చేందుకు నిరాకరించారు. పర్వేదులతో పాటు సంగారం, పోతునూరుకు చెందిన నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లించేందుకు 2000, ఆగస్టులో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు నిధులు మంజూరు చేసింది. రూ.25,86,000 (చెక్ నెం.771594), రూ.12,00,000 (చెక్ నెం.732244) చెక్‌లను మిర్యాలగూడ డివిజన్ కార్యాలయానికి పంపింది.

నిలిచిన పైపులైన్ ప్రాజెక్టు పనులు

ప్రభుత్వం 2005లో రూ.2,813కోట్లతో ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో 4లక్షల ఎకరాలకు సాగునీరందించడమే గాక, హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాలకు తాగునీరందించే లక్ష్యంతో 2007లో ఎస్ఎల్‌బీసీ నిర్మాణ పనులు ప్రారంభించి 44కి.మీ సొరంగ మార్గానికి ఇరువైపులా ఇన్‌లెట్, అవుట్‌లెట్ వైపు నుంచి పనులు ప్రారంభించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా హైదరాబాద్‌కు తాగునీరు అందుతుందని, పైపులైన్ నిర్మాణం అవసరం లేదంటూ సుంకిశాల-కోదండాపూర్ పనులను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో తీవ్ర జాప్యం జరిగి నేటికీ పనులు పూర్తికాలేదు.

పనులు నిలిచిపోవడంతో అక్రమాలు

ప్రభుత్వం 2004లో సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ పనులు నిలిపివేయడంతో అప్పటికే హెచ్ఎండబ్ల్యూఎస్ నుంచి నిర్వాసితులకు పరిహారం కింద మంజూరైన నిధులు కాజేసే కుట్రకు మిగతా 8వ పేజీలో...

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

- ప్రజలు ఇదే కోరుకుంటున్నారు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

దేవరకొండ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మార్చాలని కేసీఆర్‌ను ప్రజలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకొండలో జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతోందన్నారు. కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అక్కడి సీఎం చంద్రబాబు 72శాతం వినియోగించగా, మన రాష్ట్ర ప్రభుత్వం 28శాతం వినియోగించుకుందని, దీనిపై మాట్లాడే దమ్ము మంత్రులకు లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబును చూస్తేనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భయపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా హామీలు ఇచ్చి మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ మోసగాళ్ల పార్టీ అని, కమీషన్లు వచ్చే పనులే చేస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలను ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు నిలదీస్తే అక్రమంగా కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే పరిస్థితిలేదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వమని, ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటువేసి పొరపాటు చేశామని ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవరకొండ నియోజకవర్గానికి రూ.600కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు దేవరకొండ నియోజకవర్గం నుంచి 5వేల మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, కేతావత్ బీల్యానాయక్, గాజుల ఆంజనేయులు, కంకణాల వెంకట్‌రెడ్డి, లోక్యానాయక్, సుభాష్‌గౌడ్, చింతపల్లి పుల్లయ్య, దస్రునాయక్, రాఘవచారి, నారాయణరెడ్డితోపాటు నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ ఇలాత్రిపాఠి

మర్రిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలాత్రిపాఠి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. సెలవులు పెట్టకుండా, విధులకు హాజరు కాకుండా ఉన్న వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, రోగులకు మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని సూచించారు. సిబ్బంది విధులకు రాకపోవడంతో డీఎంహెచ్‌తో ఫోన్ మాట్లాడి సెలవులు పెట్టకుండా విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ తనిఖీ చేసి రోగులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మర్రిగూడలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

ఉపాధి హామీ పనులు భేష్

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నందుకు మర్రిగూడ ఎంపీడీవో మున్నయ్యను కలెక్టర్ అభినందించారు. ఎంపీడీవో కార్యాలయానికి ఆమె వెళ్లి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో పాల్గొన్నారు.

స్థలాలు సేకరించాలి

చండూరు: శివన్నగూడెం రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గ్రామాల స్థానంలో ఏర్పాటు చేయనున్న పునరావాస కేంద్రాలకు రెండు రోజుల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చండూరు ఆర్డీవో కార్యాలయంలో చండూరు, దేవరకొండ ఆర్డీవోలు శ్రీదేవి, రమనారెడ్డి ఇతర శాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు.

బతికుండగానే చంపేశారు సార్

- ఏఎస్పీ, తహసీల్దార్‌కు బాధితురాలి ఫిర్యాదు
- 3ఎకరాల భూమి కోసం మాజీ సర్పంచ్, ఆమె భర్త దారుణం

రెవెన్యూ అధికారుల విచారణతో వెలుగులోకి

దేవరకొండ, ఏప్రిల్16 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ పేరిట ఉన్న మూడు ఎకరాల భూమిని కాజేసేందుకు అప్పటి అధికార పార్టీ సర్పంచ్(బీఆర్ఎస్), ఆమె భర్త పన్నాగం వెలుగుచూసింది. సదరు మహిళ బతికి ఉండగానే మరణించినట్లు ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. 2022-23 సంవత్సరంలో ఈ సంఘటన జరగ్గా, బాధితుల ఫిర్యాదుతో సంఘటన తెలిసింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దేవరకొండ మండలం కాచారం గ్రామానికి చెందిన అబ్బనబోయిన పెద్దమ్మ పేరిట అదే గ్రామంలోని సర్వేనంబర్ 13/12/1లో మూడు ఎకరాల భూమి ఉంది. పెద్దమ్మ గ్రామంలో కూలి పనులకు వెళ్తుండగా, భర్త దివ్యాంగుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. కుమారులు, కుమార్తె వివాహం కావడంతో వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. కుమారులు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో పెద్దమ్మ తన మూడు ఎకరాలు అప్పుడప్పుడు సాగు చేస్తుండగా, కొన్నాళ్లు పడావుగా ఉంటుంది. ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో నమోదుకాగా, డిజిటల్ సంతకం పెండింగ్‌లో ఉన్నందున పట్టా పాస్ పుస్తకం జారీ కాలేదు. రైతు బంధు కూడా రావడం లేదు. ఆ మూడు ఎకరాలు గ్రామ శివారులో ఉండడం, పడావుగా ఉండడం, ఎకరా రూ.30-40లక్షల వరకు పలుకుతుండడంతో అప్పటి గ్రామ సర్పంచ్ నోముల లక్ష్మి(బీఆర్ఎస్), ఆమె భర్త యాదయ్యకు కన్నుపడింది. భూమిని కాజేయాలనే దురుద్దేశంతో 2020లో పెద్దమ్మ చనిపోయినట్లుగా గ్రామ పంచాయతీలో మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించాడు. అనంతరం డెత్ సర్టిఫికెట్ ద్వారా పెద్దమ్మ వారసులుగా పేర్కొంటూ నోముల లక్ష్మి, యాదయ్యలు పౌతీ కోసం మీసేవ ద్వారా తహసీల్దార్, జాయింట్ సెక్రటరీకి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటినుంచి పౌతీ దరఖాస్తు పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల మాజీ సర్పంచ్ పౌతీ చేయాలని ఒత్తిడి చేయడంతో రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహించారు. ఈ క్రమంలో దేవరకొండ ఆర్ఐ గోపిరాజు, రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టగా అబ్బనబోయిన పెద్దమ్మ బతికే ఉన్నట్లు తేలింది. దీంతోపాటు పెద్దమ్మకు, మాజీ సర్పంచ్‌కు ఎలాంటి బంధుత్వం, రక్త సంబంధం లేదని విచారణలో వెల్లడైంది. పెద్దమ్మకు భర్త, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారని గ్రామస్థులు ఆర్ఐకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆర్ఐ పౌతీ దరఖాస్తును తిరస్కరించారు. ఆర్ఐ విచారణతో విషయం వెలుగులోకి రావడంతో మాజీ సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త యాదయ్యపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బాధితురాలు పెద్దమ్మ బుధవారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక, తహసీల్దార్ సంతోష్‌కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. తన మూడు ఎకరాల భూమికి పాస్ పుస్తకం ఇప్పించాలని అధికారులను కోరారు. సంబంధిత ఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం మాజీ సర్పంచ్, ఆమె భర్త కాంగ్రెస్‌లో చేరారు.



బాధితురాలు పెద్దమ్మ, ఆమె భర్త అచ్చయ్య

ప్రయాణికుల దాహం తీర్చరూ

ఆర్టీసీ బస్టాండ్లలో ఇక్కట్లు •6లో..

అప్రమత్తంగా ఉందాం

● సెలవు రోజుల్లో ప్రాజెక్టులు, నదులు, చెరువుల వద్దకు పర్యాటకులు ● కనిపించని హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యలు •7లో..

మల్లీశ్వరి ఆత్మహత్యకు కారకులను
కఠినంగా శిక్షించాలి

బొక్కమంతలపహాడ్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బొక్కమంతులపహడ్ గ్రామస్థులు

నిడమనూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొక్కమంతలపహడ్ గ్రామానికి చెందిన దర్శారపు మల్లీశ్వరి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బుధవారం రాత్రి ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మల్లీశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. నిందితుడు జాన్‌రెడ్డితో పాటు అయన కుటుంబ సభ్యులపై హత్యా కేసు నమోదు చేసి శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటమ్మ, వెంకటయ్య, వంగాల నాగార్జున, మాతంగి శాంతికుమార్, కురుపాటి కోటేశ్వర్, రేగూరి భరత్‌కుమార్, దర్శారపు శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్వీట్: ప్రియుడి చేతిలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న దళిత యువతి మల్లీశ్వరి కుటుంబానికి మద్దతుగా సంఘీభావం తెలుపుతూ బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తదితరులు ట్వీట్లు చేశారు. కుల వివక్షకు మరో ప్రాణం బలైందని, ఈ మారణహోమం ఆగేదెన్నడో అంటూ ట్వీట్ చేశారు. మృతురాలి ఆత్మహత్యకు కారణమైన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మల్లీశ్వరి కుటుంబానికి సానుభూతి తెలుపుతూ కుల వివక్ష అంతం కావాలని ట్వీట్ చేశారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు నిత్యం పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. పోషణ అభియాన్‌లో భాగంగా మండలంలోని ముదిమాణిక్యం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, అన్నపూర్ణ, ఆయాలు పాల్గొన్నారు.

చింతపల్లిలో నేడు భూభారతి పోర్టల్ ప్రారంభం

చింతపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా గురువారం భూభారతి పోర్టల్‌ను ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ రమాకాంత్‌శర్మ బుధవారం తెలిపారు. రైతుల భూముల వివరాలను పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బాలునాయక్


మదనాపురం ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. మండలంలోని మదనాపురంలో బుధవారం లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ డేరంగుల మహేష్, మాల్ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ దొంతం అలివేలూసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు పునరావాసం : ఆర్డీవో


నసర్లపల్లిలో భూనిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణారెడ్డి

చింతపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): భూనిర్వాసితులకు ప్రభుత్వం పునరావాసం కల్పించేందుకు సిద్ధంగా ఉందని దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. మండలంలోని నరసర్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 287లో అసైన్డ్ భూమి సేకరణ చేసి పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపునకు గురైన గుడితండా వాసులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా భూములు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించడానికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రాజెక్టు పనులు నిర్వహించేందుకు భూములు ఇచ్చిన రైతులను గుర్తించి వారికి త్వరలో ప్యాకేజీ ప్రకారంగా భూములు కల్పించడాకి కు ప్రణాళిక తయారు చేశామన్నారు. ప్రజలందరూ అధికారులకు సహకరిస్తే తమకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఆర్ఐ సునీత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై వివక్షను రూపుమాపాలి

పెద్దవూర, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దళితులపై వివక్షతను రూపుమాపాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. మండలంలోని సంగారం గ్రామంలో బుధవారం కుల వివక్షపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నేటికీ ఆంజనేయస్వామి ఆలయంలోకి దళితులను రానీవ్వడం లేదని, కనీసం అరుగులపైన కూడా కూర్చొనీయడం లేదని వాపోయారు. దళితులు కూలీ పనులకు వెళ్తే బిందె, చెంబును ప్రత్యేకంగా ఉంచడం అన్యాయమన్నారు. దళితులు వివక్ష రూపాలపై త్వరలో ప్రతిఘటన పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వివక్షత రూపాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో దొంతాల నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, మాతంగి దయాకర్, రాములు, గణేష్, జానయ్య, పద్మ, జయమ్మ, లక్ష్మమ్మ, విమలమ్మ, రాజు,కోటమ్మ, గణేష్ పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలులో క్షేత్రస్థాయి విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే బీఎల్‌ఆర్, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు అంకెపాక జనార్దన్ మాట్లాడుతూ 20ఏళ్లుగా పనిచేస్తున్న ఎఫ్‌ఏలను పంచాయతీ కార్యదర్శి అసిస్టెంట్లుగా గుర్తించి పే స్కేల్ అమలుచేయాలని కోరారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం కల్పించాలన్నారు. 4779జీవోను రద్దుచేసి లీస్టు-3 కింద తొలగించిన ఎఫ్‌ఏలను విధుల్లోకి తీసుకోవడంతోపాటు హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికైన శంకర్‌నాయక్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏలు గుడుగుంట్ల తులసి, ఫక్రుద్దీన్‌బాబా, మధు, సతీష్, మైసయ్య, రాములమ్మ, సాలయ్య, అంజి, సైదులు, కవిత, మోహన్, శంకర్, సరిత పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించటంతోనే వృద్ధుడి మృతి

● ఏరియా ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

మిర్యాలగూడఅర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంజక్షన్ వికటించి వృద్ధుడు మృతిచెందాడని ఆరోపిస్తూ బాధితుడి కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో ఈ సంఘటన జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. త్రిపురారం మండలం బొర్రాయిపాలెం గ్రామానికి చెందిన మొండికత్తి కృష్ణయ్య(70) కొంతకాలంగా మోకాళ్ల నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఈ నెల 14న ఏరియా ఆస్పత్రికి వచ్చాడు. వైద్యుల సూచన మేరకు ఆస్పత్రిలో చేరాడు. చికిత్స అందిస్తున్న క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వృద్ధుడి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు సిబ్బంది ఈ నెల 15న సెలైన్ బాటిల్ పెట్టారు. సాయంత్రం సెలైన్‌కు ఇంజక్షన్ చేశారని కుటుంబసభ్యులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున కృష్ణయ్య మృతిచెందటంతో వైద్యుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. మోకాళ్ల నొప్పితో బాధపడుతూ చికిత్స కోసం వచ్చిన వృద్ధుడిని వైద్యులు పట్టించుకోలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు సరైన వైద్యం లభించకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస సమరథ్ మాట్లాడుతూ వృద్ధుడి మృతి విషయంలో వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హాలియా, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీ పరిధిలోని పశువుల సంత వీధిలో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నివాస ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న వస్తువులను గుర్తించి అవి అగ్నిప్రమాదాలకు గురైనప్పుడు వాటిని ఎలా నివారించాలో కాలనీ ప్రజలకు వివరించారు. ముఖ్యంగా నివాస ప్రాంతంలో ఎల్‌పీజీ సిలిండర్ ద్వారా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలా ఆర్పి వేయాలో ప్రదర్శన ద్వారా అగ్నిమాపక సిబ్బంది తెలియజేశారు. కార్యక్రమంలో హాలియా లీడింగ్ ఫైర్‌మెన్ కోటేశ్వర్‌రావు, సురేందర్, పాలయ్యా, శంకర్, నాగరాజు, సాయికిరణ్, మోహన్, జలందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా 'ప్రత్యేక' పాలన

● అంజనపల్లిలో సరిగ్గా అందని మిషన్ భగీరథ నీరు, అధ్వానంగా పారిశుధ్యం ● రాగడపలో రోడ్డుపైనే మురుగు నీరు ● సమస్య పరిష్కరించాలని వేడుకోలు

త్రిపురారం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం పూర్తయి పలు గ్రామాల్లో కార్యదర్శుల పాలనలో కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని అంజనపల్లి మేజర్ గ్రామపంచాయతీ. గ్రామంలో సుమారు 2 వేలకు పైగా జనాభా ఉండగా ఇప్పటికీ తాగునీటి సరఫరా సరిగా లేదు. మిషన్ భగీ రథ నీరు సంబంధించిన పైప్‌లైన్ పగిలిపోయిన 6 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ మరమ్మతు చేయలేదు. ఓవర్‌హెడ్ ట్యాంకు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేక వృథాగా మారింది. గ్రామంలో కొద్ది భాగంలో 5 నిమిషాలు నీరు వస్తుండగా మిగిలిన ప్రాంతంలో పూర్తిగా రావడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కావడంతో పొద్దస్తమానం తాగు నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.. గ్రామంలో మూడు చేతి పంపుల వద్ద అవసరాలకు నీరు పట్టుకోవడానికి మహిళలు బారులు తీరుతున్నారు. తాగు నీటి సమస్య ఇంత తీవ్రంగా కార్యదర్శి అసలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నాడని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటి కోసం ప్రైవేటు వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించినా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు చెపుతున్నారు. సర్పంచులు లేక పోవడంతో అధికారులు బాధ్యత తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

పారిశుధ్యం అధ్వానం..

అంజనపల్లిలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఏ బజారులోకి వెళ్లినా మురుగు నీరు నిలబడి దుర్గంధం వస్తుండడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు.. కనీసం గ్రామ పంచాయతీ ముందు ఉన్న మురుగు కాల్వలో చెత్తా చెదారంతో నిండి పోయినా రెండు నెలలుగా కనీసం శుభ్ర పరచ లేదని గ్రామస్థులు చెపుతున్నారు.. ప్రతి కాల్వ పూడి పోవడంతో ఇళ్ల ఆవరణలోకి రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ముక్కు మూసుకుని బతకాల్సి వస్తుందని, కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యదర్శికి చెప్పినా ఫలితం ఉండటం లేదని మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


అంజనపల్లిలో పూడిపోయిన మురుగు కాల్వలు

రాగడపలో ఇదే పరిస్థితి..

రాగడప గ్రామ పంచాయతీల 650 జనాభా ఉండగా తాగునీరు పూర్తి స్థాయిలో అందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.. ఇక పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా ఉంది.. గ్రామంలోని సీసీ రహదారులపై నుంచే మురుగు నీరు పారుతుండడంతో కనీసం నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు.. మురుగు నీటి కాల్వల్లో నెలల తరబడి చెత్త తొలగించకపోవడంతో ఇళ్ల నుంచి నీరు బయటకు రావడం లేదని గ్రామస్థులు చెపుతున్నారు.. ఎవరి ఇంటిలో వారు నీరు ఇంకడానికి గుంతలు తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.. సమస్యలు అధికారుల దృష్టికి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో పల్లెల్లో సమస్యలు తల్లడిల్లుతున్నాయి..కనీసం జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రాగడపలో సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు

తాగునీటి సమస్య లేదు



గ్రామాల్లో తాగునీటి సమస్య లేదు. మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నాం. గ్రామాల్లో పారిశుధ్యం సమస్యపై నాదృష్టికి రాలేదు. గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్ష చేస్తున్నా.

విజయకుమారి, ఎంపీడీవో, త్రిపురారం

తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నాం



ఎండకాలం ప్రారంభమైనప్పటి నుంచే తాగు నీరు రావడం లేదు.. దాంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. బజారులో ఉన్న చేతి పంపు వద్దకు వెళ్లి నీటిని తీసుకువస్తున్నాం.. నీళ్లు రావడం లేదని చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదు.

-మడుపు లక్ష్మమ్మ, అంజనపల్లి

రహదారులపై మురుగు



గ్రామంలో ఒక్క మురుగు కాల్వ సరిగా లేదు. అన్ని పూడి పోయిన ఉన్నాయి. నీళ్లన్నీ రహదారులపై నుంచి వెళ్తున్నాయి. ఇంట్లో మురుగు నీరు ఇంకి పోవడానికి పాత కాలం పద్ధతిలో గుంతలు తీసుకుంటున్నాం.. ప్రత్యేక అధికారుల పాలనలో అవస్థలు పడుతున్నాం..

-పోషబోయిన యాదగిరి, రాగడప

మత్స్య సహకార సంఘంలో వారసుల పేర్లు నమోదు చేయాలి

మిర్యాలగూడ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మత్స్య పారిశ్రామిక సహకారం సంఘంలో వారసుల పేర్లు నమోదు చేయాలని మిర్యాలగూడ సంఘం సభ్యులు చింతకాళ్ల సైదులు, కేసరి వీరప్రసాద్, నక్క సైదులు, దుండిగల రామ్ కోరారు. ఈ మేరకు స్థానిక అమర వీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘంలో 246 మంది సభ్యులుండగా అందరూ చేపలను పట్టి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారిలో కొందరు చనిపోగా వారిస్థానంలో వారి వారసులను సభ్యులుగా చేర్చాలని జనవరి 20న జరిగిన సంఘం పాలకవర్గ సమావేశంలో తీర్మానించినట్లు చెప్పారు. అందుకు ఏప్రిల్ 16న శ్రీనివాస్‌నగర్ నల్లచెరువు వద్ద వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించాలని కోరినట్లు చెప్పారు.సమావేశం తీర్మాణ ప్రతిని మత్స్యశాఖ జిల్లా అధికారికి అందజేసినట్లు తెలిపారు. వారసుల పేర్లను నమోదు చేసి మత్స్యశాఖ గుర్తింపు కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కాగా బుధవారం జరగాల్సిన వృత్తి నైపుణ్య పరీక్షరద్దు చేసేందుకు కొందరు హైదరాబాద్ మత్స్య శాఖ కార్యాలయంలో తప్పుడు ఫిర్యాదు చేశారని అన్నారు. 20 ఏళ్ల నుంచి చనిపోయిన వారి వారసులకు సభ్యత్వం దక్కకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని అన్నారు. అనంతరం ఈ విషయమై ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వెంటనే మత్స్యశాఖ జిల్లా అధికారితో మాట్లాడి వారసులను సంఘంలో సభ్యులుగా చేర్చి గుర్తింపు కార్డు మంజూరు చేయాలని సూచించడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మత్స్య సహకార సంఘం సభ్యులు, వారసులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో లావూరి బాలు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని సినాప్స్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పాలిసెట్ శిక్షణ శిబిరాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని కళాశాల విద్యలో ప్రవేశం పొందాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఛత్రపతి చౌహాన్ చత్రపతి చౌహాన్ కీర్తి, రాపాక సాయి, సురేందర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, అభి పాల్గొన్నారు.

యూడైస్ సర్వే

గుడిపల్లి(పెద్దఅడిశర్లపల్లి)ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు యూడైస్ సర్వే చేపడుతున్నట్లు ఎంఈవో సముద్రాల శ్రీనయ్య తెలిపారు. మండలంలోని ఘనపురం, చిలకమర్రి, పోల్కంపల్లి గుడిపల్లితో పాటు 10 పాఠశాలల్లో బుధవారం ఛాత్రోపాధ్యాయులు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఏటా యూడైస్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు పూర్తి చేసి వారని, వివరాల నమోదులో తప్పులు దొర్లుతున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందుకు ఈ నెల 15 నుంచి 21 వరకు మండలంలోని అన్ని పాఠశాలలో సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్య క్రమంలో ఛాత్రోపాధ్యాయులు స్వామి, హెచ్‌ఎం సైదయ్య, సీఆర్‌పీ కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల తనిఖీ

● విచారించి వదిలేసిన పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అద్దంకి- నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై వెళ్తున్న రెండు ఇసుకలారీలను నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు వై జంక్షన్ వద్ద బుధవారం రాత్రి పట్టుకున్నారు. సదరు లారీలు శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామపరిధిలోని మూసీనది నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్నాయి. వాహనతనిఖీలో భాగంగా లారీలను అడ్డుకున్న పోలీసులు ఇసుకలోడుతో వెళ్తున్న లారీలకు సంబంధించిన మైనింగ్ వే బిల్లులను తనిఖీ చేశారు. లారీల్లో 35 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల ఇసుకను తలిస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. లారీల్లో తరలిస్తున్న ఇసుక ఎక్కడకు తీసుకెళ్తున్నారన్న దానిపై విచారించారు. మార్చి 26న ఇసుక రవాణా కోసం అనుమతి పొందగా మైనింగ్ అధికారులు బుధవారం లోడింగ్‌కు అనుమతి ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. కాగా ఇసుక రవాణా కోసం మైనింగ్‌శాఖ నుంచి పూర్ణచందర్ అనే వినియోగదారుడు నల్లగొండ, నందికొండ, హాలియా, మిర్యాలగూడ ప్రాంతాల్లో డెలివరీ ఇచ్చేందుకు అనుమతి వే బిల్లు తీసుకున్నట్లుగా గుర్తించామని వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు. బుధవారం సాయంత్రం 5గంటల లోపు డెలివరీ ప్రదేశానికి చేరాల్సిన లారీలు మూడుగంటలు ఆలస్యంగా చేరడంతో అనుమానించి విచారించామన్నారు. తమకు పట్టుబడ్డ లారీల వివరాలతో కూడిన వేబిల్లులను మైనింగ్‌శాఖ, శాలిగౌరారం మండల పోలీసులను సంప్రదించిన ఆరా తీయగా సక్రమంగానే రవాణా జరుగుతున్నట్లు గుర్తించిన అనంతరం వదిలేసినట్లు సీఐ తెలిపారు. కాగా శాలిగౌరారం మండలం వంగమర్తి రీచ్ నుంచి మాత్రమే ఇసుక రవాణాకు మైనింగ్‌శాఖ అనుమతులిస్తున్న నేపథ్యంలో అక్కడి ఇసుకను డెలివరీ చేసేందుకు అనుమతులు పొందిన వ్యక్తులు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతనిచ్చి అధిక ధరలకు విక్రయించి లాభాలు పొందుతున్నారు. జిల్లాలో హాలియా, వేములపల్లి, నల్లగొండ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న రీచ్‌లనుంచి ఇసుక రవాణా నిలిచిపోవడంతో వినియోగదారులు వంగమర్తి రీచ్‌నుంచి క్యూకడుతున్న నేపథ్యంలో అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకునేందుకు వినియోగదారులు పోటీపడుతున్న నేపథ్యంలో ఇసుక వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తోంది. ప్రాంతాల వారీగా మైనింగ్ అధికారులు గుర్తించి రీచ్‌ల నుంచి ఇసుక రవాణాకు అధికారులు అనుమతులివ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

పరిహారం మింగేశారు


(5వ పేజీ తరువాయి)

తెరలేచింది. పైపులైన్ నిలిచిపోవడంతో భూములకు ఇబ్బంది లేదంటూ పాల్తీతండ, జైరాంతండాలో ప్రచారం చేయడంతో రైతులు పరిహారం గురించి పట్టించుకోలేదు. దీంతో అప్పటి పర్వేదుల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వ్యక్తి అనారోగ్యంతో ఉండటంతో అతడి కుమారుడు అనధికార విధులు నిర్వహిస్తూ రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి పరిహారం కాజేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన రెండు చెక్కుల్లో ఒకటి రూ.25.86లక్షలు కాగా, దీన్ని స్థానిక ఎస్‌బీఐలో జమ చేశారు. మరో రూ.12లక్షల చెక్కును ఏ బ్యాంకులో జమచేశారన్న విషయంలో స్పష్టత లేదు. లబ్ధిదారులకు పరిహారం అందజేయకుండానే అక్విటెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు ఫోర్జరీ చేసి నిధులు కాజేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆర్డీవో కార్యాలయంలో సైతం దీనికి సంబంధించిన రికార్డులు లేవని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు.

నిధుల స్వాహా వెలుగులోకి

రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం సుంకిశాల-కోదండాపూర్ పైపులైన్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించింది. 2021లో రూ.20వేల కోట్లతో మేఘా సంస్థకు నిర్మాణపనులు అప్పగించింది. 11కిలోమీటర్ల పైపులైన్ పనులు కొనసాగుతుండగా, 2023లో పర్వేదుల రెవెన్యూ శివారులోని 92సర్వే నెంబర్ భూమి వద్దకు రాగానే రైతు జైపాల్‌రెడ్డి పైపులైన్ పనులను అడ్డగించాడు. ప్రభుత్వం తన భూమిని సేకరించలేదని, తనకు పరిహారం అందజేయలేదని అధికారులకు వివరించారు. దీంతో వారు నిర్వాసితుల జాబితాను పరిశీలించగా 6.05 ఎకరాలకు రూ.1,77,000 పరిహారం చెల్లించినట్టు జాబితాలో ఉండటంతో అతడు అవాక్కయ్యాడు. అతడికి 93 సర్వేనెంబర్‌లో, అతడి అన్నదమ్ములు ఘట్టారెడ్డికి 80, 88 సర్వే నెంబర్‌లో, సాయి శరత్‌రెడ్డికి 91 సర్వే నెంబర్‌లో వేర్వేరు పట్టాలు ఉన్నప్పటికీ, అందరివి కలిపి జైపాల్‌రెడ్డికే పరిహారం ఇచ్చినట్టు జాబితాలో ఉంది. ఇలా సుమారు 15 నుంచి 20 మంది రైతులకు చెందిన ఫోర్జరీ సంతకాలతో పరిహారాన్ని మింగేసినట్టు ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారులు స్పందించి లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


నక్సల్స్ ఇళ్లు పేల్చివేయడంతో



పైపులైన్ వచ్చేమార్గంలో నా భూమి కోసం నిర్మించిన పెద్ద నీటి ట్యాంక్ ఉంది. దీంతో భూసేకరణకు నేను అంగీకరించలేదు. అదే సమయంలో 1999 డిసెంబరు 13న నక్సలైట్లు పర్వేదులలో నా ఇంటిని బాంబులతో పేల్చివేశారు. దాంతో ఐదారేళ్లపాటు ఊరికి దూరంగా ఉండాల్సివచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారాన్ని నాకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో స్వాహా చేశారు. అప్పటి ఆర్డీవో సమక్షంలోనే నిధుల స్వాహా జరిగింది. గతంలో పెద్దవూర తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశా. సదరు అధికారి సొంత మండలంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తుండటంతో చర్యలు తీసుకోవడం లేదు. ఈ విషయమై సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.

జైపాల్‌రెడ్డి రైతు, పర్వేదుల, పెద్దవూర మండలం.

విచారణకు ఆదేశించాం



సుంకిశాల-కోదండాపూర్ భూనిర్వాసితుల పరిహారం విషయంలో అవకతవకలపై ఫిర్యాదులు అందాయి. శాఖాపరమైన విచారణకు ఆదేశించాం. అధికారుల నుంచి నివేదిక రాగానే సమీక్ష జరిపి చర్యలు తీసుకుంటాం.

నారాయణ అమిత్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కు శుభాకాంక్షలు


ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా,ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): శాసన మండలి ప్రాంగణంలో దాసోజు శ్రవణ్ కుమార్ ఎమ్మెల్సీగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని శ్రవణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు.

యువవికాసం పథకానికి 1,444 దరఖాస్తులు

పెద్దఅడిశర్లపల్లి,గుడిపల్లి,ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి):రాజీవ్ యువ వికాసం పథకానికి పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి మండలాల పరిధిలో 1,444 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవోలు చంద్రమౌళి, పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి ఈ నెల 14 వరకు ప్రభుత్వం గడువు విధించింది. దీంతో దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతో పాటు దరఖాస్తులను నేరుగా ఎంపీడీవో కార్యాలయం కౌంటర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పీఏపల్లి మండలంలో ఎస్సీ కార్పొరేషన్‌లో 184 మంది, ఎస్టీ కార్పొరేషన్‌లో 392 మంది, బీసీ కార్పొరేషన్‌లో 385 మంది, ముస్లింలు 33 మంది, ఈబీసీలో 07 మంది దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గుడిపల్లి మండలంలో ఎస్సీ కార్పొరేషన్‌లో 133 మంది, ఎస్టీ కార్పొరేషన్‌లో 105 మంది, బీసీ కార్పొరేషన్‌లో 192 మంది, ముస్లింలు 02 మంది, ఈబీసీలో 11 మంది దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు మద్దతు ధరతోపాటు బోనస్ లభిస్తుందని హాలియా మార్కెట్ కమిటీ ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజవరం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన పంటకు మద్దతు ధర అందించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ప్రారంభిస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చి ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, ఏపీఎం నరసింహ, నాయకులు నెమలి శ్రీధర్‌రెడ్డి, కోట నాగిరెడ్డి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.


రాజవరంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి